**రిపోర్టర్లు కావలెను...**

నిత్య నూతనంగా వెలుగుతూ సంచలన వార్తా కథనాలతో ముందుకు సాగుతున్న నేటి ప్రభాత సూర్య దిన పత్రిక లో పనిచేయుటకు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలలో, నియోజకవర్గాలలో మండల కేంద్రాలలో అంకిత భావంతో పనిచేసే రిపోర్టర్లు కావలెను ఆసక్తి కలిగిన వారు క్రింది ఉన్న నంబర్ కి సంప్రదించగలరు

సంప్రదించవలసిన వారు

9100900931, 9100900918

గమనిక :వాట్సాప్ లో బయోడేటా పంపగలరు



# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784.









ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 23 ఎడిటర్ : పోలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- మంగళవారం - 24 - జూన్ - 2025


## ఇజ్రాయెల్ దాడుల్లో 500కు చేరిన మృతుల సంఖ్య

- ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్ లో భారీగా మరణాలు
- మృతుల సంఖ్య రెట్టింపు ఉండవచ్చంటున్న మానవ హక్కుల సంస్థలు
- అంతర్జాతీయ మీడియా సంస్థలపై ఇరాన్ ఆంక్షలు



ఇరాన్/ఇజ్రాయిల్ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల కారణంగా మృతుల సంఖ్య 500కు చేరిందని మిగతా.. 2లో

## యుద్ధం మీరు మొదలు పెట్టొచ్చు.. ముగించేది మేమే.. ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక

అమెరికాపై ప్రతీకార దాడులకు దిగుతామని ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరిక

అణు స్థావరాలపై దాడులతో తమ లక్ష్యాల పరిధి విస్తరించిందని ప్రకటన

ఇజ్రాయెల్ బాంబు దాడి ఒక పెద్ద తప్పిదమని ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమేనీ వ్యాఖ్య

అమెరికా... ఇరాన్: అమెరికా... ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేయడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అమెరికా తమపై నేరుగా దాడులకు పాల్పడినందున ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ సైన్యం సోమవారం హెచ్చరించింది. ఇరాన్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి ఇబ్రహీం జుల్ఫఘారీ




## అరాచకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు




- కూటమి ప్రభుత్వం రాకుంటే ఏపీ ఏమయ్యేదో..?
- ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు గాడిలో పెడుతున్నారు
- రాష్ట్రానికి మోదీ పూర్తి అండగా నిలుస్తున్నారు
- ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- గత వైసీపీ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్న పవన్

అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సే తన ప్రథమ ప్రాధాన్యమని, 2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగించిందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక కష్టనష్టాలకు గురయ్యారని మిగతా.. 2లో

## కమిషన్లన్నీ మేడిగడ్డపైనే ఉంటాయి.. సుంకిశాలపై ఉండవు: హరీశ్‌రావు

మేడిగడ్డకు ఒక నీతి.. సుంకిశాలకు ఇంకో నీతా

మేడగడ్డకు చిన్న మరమ్మతులు చేసి గోదావరి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశం

భారాసను బద్నాం చేయాలనే సింగిల్ పాయింట్

అజెండాతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది మిగతా.. 2లో






## జగన్‌కు మానవత్వమే లేదు... ఉంటే సింగయ్యను అలా వదిలేసి వెళ్లరు!: షర్మిల

- పల్నాడు ఘటనలో సింగయ్య మృతికి జగన్ నిర్లక్ష్యమే కారణం
- క్షమాపణ చెప్పకుండా ఫేక్ వీడియో అనడం దారుణం
- బాధిత సింగయ్య కుటుంబానికి రూ.10 కోట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- జగన్ జన సమీకరణ కార్యక్రమాలకు అనుమతించొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ఘటన జరిగినప్పుడు కారులో ఉన్నవారిని విచారించాలని కోరిన షర్మిల

## గ్రామాల్లో సుపరిపాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు

**మరో శుభవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం.. ఇకపై ప్రతి మండలంలో రెండు..**

- తెలంగాణ రాజధాని హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చేందుకు రేవంత్ సర్కార్ కృషి
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేసింది
- ఇకపై ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మరో శుభవార్త తెలిపింది. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇటీవల రైతు భరోసా నిధులు విడుదల చేసి కేవలం ఆరు రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ. రూ. 7,700 కోట్లు పంపిణీ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. మిగతా.. 2లో

## పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించిన అఖిలేశ్ యాదవ్

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలు

జీజేపీతో సంబంధాలు ఉన్నాయంటూ వేటు

రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన ముగ్గురు ఎమ్మెల్యేలు



ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో, ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ముగ్గురు సిట్టింగ్ శాసనసభ్యులను పార్టీ నుంచి బహిష్కరిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు, బీజేపీతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయని మిగతా.. 2లో











## త్వరలో తెలంగాణలో కొత్త క్రీడా పాలసీ: జయేశ్ రంజన్

- హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు
- ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయి మిగతా.. 2లో

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు పూర్తి

ఎన్నికల నిర్వహణకు 30 రోజుల గడువు కావాలని ప్రభుత్వం విజ్ఞప్తి

తయారీకి 60 రోజులు సమయం కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... తీర్పు రిజర్వు



హైదరాబాద్: తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ అంశంపై రాష్ట్ర హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మరియు పిటిషనర్ల తరఫున వాదనలు సోమవారం ముగిశాయి. ఇరు పక్షాల వాదనలను విన్న ఉన్నత న్యాయస్థానం, తన తీర్పును రిజర్వ్ మిగతా.. 2లో









## రైతుభరోసా సంబరాలు చేపట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల




ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల

111 ఎకరాలకు రైతు భరోసా అందించిన

ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

ఎకరాకు రూ.12వేల చొప్పున

అన్ని వ్యవసాయ భూములకు అందజేత

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com



# కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధిస్తాం

## మేనిఫెస్టో హామీలన్నీ నెరవేరుస్తామన్న పురందేశ్వరి

## అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని స్పష్టీకరణ

## అమరావతి రైతులకు అండగా ఉంటామని వెల్లడి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని, అవినీతికి ఏమాత్రం తావులేని పారదర్శక పాలన అందిస్తామని ఆమె తెలిపారు. విజయవాడలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని పురందేశ్వరి తెలిపారు. "అమరావతి రైతులకు మేం అండగా ఉంటాం. వారికి ఇవ్వాల్సిన పరిహారం అందజేసి న్యాయం చేస్తాం" అని ఆమె భరోసా ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధిస్తామని చెప్పారు. విశాఖపట్నం నగరాన్ని ఆర్థిక రాజధానిగా, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తామని పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంపై పురందేశ్వరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారు" అని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామని వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, గత పాలనలో పెరిగిపోయిన గంజాయి, డ్రగ్స్, భూకబ్జాలు, మహిళలపై దాడులు వంటి అరాచకాలకు అడ్డుకట్ట వేస్తామని స్పష్టం చేశారు. ఇసుక, మద్యం, గనుల పేరుతో జరిగిన దోపిడీకి చరమగీతం పాడతామన్నారు. పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థను పార్టీ కార్యక్రమాలకు వాడుకున్నారని ఆరోపించారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పురందేశ్వరి సూచించారు. "ఎన్డీయే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదు. కానీ, తప్పు చేసిన అధికారులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరు, వారు మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హెచ్చరించారు. అమరావతి శాసన రాజధానిగా కొనసాగుతుందని, అదే సమయంలో కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తుందని పురందేశ్వరి పునరుద్ఘాటించారు.

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలపై
# హైకోర్టులో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

మొదటి పేజి తరువాయి



ఎన్నికల కమిషన్ మరియు పిటిషనర్ల తరఫున వాదనలు సోమవారం ముగిశాయి. ఇరు పక్షాల వాదనలను విన్న ఉన్నత న్యాయస్థానం, తన తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో, పంచాయతీ ఎన్నికల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసినా ఎన్నికలు సకాలంలో నిర్వహించడం లేదని, వెంటనే ఎన్నికలు జరిపేలా ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాదాపు ఆరు వేర్వేరు పిటిషన్లు హైకోర్టులో దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై గత కొంతకాలంగా ధర్మాసనం విచారణ జరుపుతోంది. తాజాగా జరిగిన విచారణలో, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు తమకు కేవలం నెల రోజుల గడువు సరిపోతుందని ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. మరోవైపు, ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేయడానికి కనీసం 60 రోజుల సమయం అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘం ధర్మాసనాన్ని కోరింది. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తమ తమ వాదనలను సమర్పించాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కూడా తమ వాదనలను వినిపించారు.

## గ్రామాల్లో సుపరిపాలనే లక్ష్యంగా
# రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు

మొదటి పేజి తరువాయి



తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో సుపరిపాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చేందుకు రేవంత్ సర్కార్ కృషి చేస్తోంది. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ప్రపంచాన్ని తలదన్నేలా నిర్మాణాలను చేపడుతోంది. అలాగే తెలంగాణలోని పల్లెల్లోనూ అలాంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేసింది. ఇకపై ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఓ వైపు విశ్వ నగరం హైదరాబాద్ ను అన్ని వైపులా అభివృద్ధి చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. మెట్రో రెండో దశ, ఆర్ఆర్ఆర్ నిర్మాణాలు, హైడ్రా.. తదితర నిర్ణయాలతో హైదరాబాద్ ను ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దేందుకు రేవంత్ సర్కార్ కృషి చేస్తోంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలనూ అదేవిధంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు త్వరలో రాష్ట్రంలోని ప్రతి మండలంలో రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్వాడీ కేంద్రాల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మంత్రి సీతక్క దగ్గరుండి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాదే రాష్ట్రంలో 1148 అంగన్ వాడీ భవనాలు,1144 గ్రామ పంచాయతీ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇక ఈ ఏడాది రాష్ట్రంలో కొత్తగా 1148 అంగన్వాడీ భవనాలను నిర్మించనుంది ప్రభుత్వం. అయితే ఈ నిర్మాణానికి ఇప్పటికే 813 స్థలాలను అధికారులు గుర్తించారు. మిగిలిన చోట్ల స్థలాల గుర్తింపు పెండింగ్ లో ఉంది. ఇక ఇదే ఏడాది రాష్ట్రంలో 1144 గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే 549 గ్రామాల్లో స్థలాలను అధికారులు గుర్తించారు. మరో 84 చోట్ల భూసేకరణ జరుగుతోందని.. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని సమాచారం.


## పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలను
# బహిష్కరించిన అఖిలేశ్ యాదవ్

మొదటి పేజి తరువాయి



పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు, బీజేపీతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయని ఎస్పీ తీవ్ర ఆరోపణలు చేసింది. వివరాల్లోకి వెళితే, గోసాయిగంజ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ శాసనసభ్యుడు మనోజ్ కుమార్ పాండేలను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు సమాజ్‌వాదీ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించింది. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని, మత ప్రాతిపదికన ప్రజలను విభజించే భావజాలం కలిగిన పార్టీతో చేతులు కలిపారని ఎస్పీ తన ప్రకటనలో తీవ్రంగా ఆక్షేపించింది. తమ రాజకీయ వైఖరిని సరిదిద్దుకోవడానికి ఈ ముగ్గురు ఎమ్మెల్యేలకు తగినంత సమయం ఇచ్చామని, అయినప్పటికీ వారిలో మార్పు రాలేదని పార్టీ అధిష్ఠానం పేర్కొంది. ఈ నేపథ్యంలో, పార్టీ ప్రయోజనాలను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, వీరిని బహిష్కరించడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేసింది. 2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించి, బీజేపీ అభ్యర్థులకు అనుకూలంగా ఓటు వేశారని సమాజ్‌వాదీ పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అప్పటి నుంచే వీరిపై పార్టీ నాయకత్వం గుర్రుగా ఉందని, సరైన సమయంలో చర్యలు తీసుకుంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. తాజా నిర్ణయంతో ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఈ పరిణామం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఇజ్రాయెల్ దాడుల్లో మృతుల సంఖ్య 500కు చేరింది



ఇరాన్/ఇజ్రాయిల్ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల కారణంగా మృతుల సంఖ్య 500కు చేరిందని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ దాడుల్లో సుమారు మూడు వేల మంది గాయపడినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ అధికారికంగా ప్రకటించింది. జూన్ 13వ తేదీ నుంచి ఇజ్రాయిల్, ఇరాన్‌పై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మీడియా సంస్థలపై ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో, ఆ దేశంలోకి ప్రవేశించడం అనేక వార్తా సంస్థలకు సాధ్యపడటం లేదు. దీంతో, ఇజ్రాయిల్ దాడుల వల్ల జరిగిన వాస్తవ నష్టంపై స్పష్టమైన అంచనాకు రావడం కష్టతరంగా మారింది. అయితే, ఇరాన్‌లో పనిచేస్తున్న మానవ హక్కుల సంస్థలు మాత్రం మృతుల సంఖ్య అధికారిక లెక్కల కంటే రెట్టింపుగా ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ గగనతలంలోకి వాణిజ్య విమానాలు ప్రవేశించడం లేదు. తాజా సమాచారం ప్రకారం, ఇరాన్‌తో పాటు ఇరాక్, సిరియా, జోర్డాన్, లెబనాన్ గగనతలాలను కూడా వాణిజ్య విమానయాన సంస్థలు పూర్తిగా దూరం పెట్టినట్లు తెలుస్తోంది. దీని ప్రభావంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం సుమారు 120 విమానాలు ఆలస్యంగా నడిచాయి. జోర్డాన్‌లోని క్వీన్ అలియా అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 40 శాతం విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సంస్థ దుబాయ్‌కి వెళ్లే తమ విమానాలను జూలై 3వ తేదీ వరకు రద్దు చేయగా, బ్రిటీష్ ఎయిర్‌వేస్ కూడా దుబాయ్, దోహాలకు తమ విమాన సర్వీసులను నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

# యుద్ధం మీరు మొదలు పెట్టొచ్చు.. ముగించేది మేమే.. ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

ఇరాన్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి ఇబ్రహీం జుల్ఫఘారీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఓ జూదగాడివైన ట్రంప్, ఈ యుద్ధాన్ని నువ్వు ప్రారంభించవచ్చు, కానీ ముగించేది మాత్రం మేమే" అని ఆయన హెచ్చరించారు. ఈ సంఘర్షణలో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొనడం వల్ల ఇరాన్ సాయుధ బలగాల చట్టబద్ధమైన లక్ష్యాల పరిధి పెరిగిందని స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా, ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఫోర్డోలోని భూగర్భ యురేనియం శుద్ధి కేంద్రంతో పాటు ఇస్ఫహాన్, నతాంజ్‌లలోని అణు కేంద్రాలపై ఈ దాడులు జరిగాయి. ఈ దాడులతో టెహ్రాన్ అణు సామర్థ్యాలను పూర్తిగా నిర్మూలించామని ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖొమేనీ కూడా స్పందిస్తూ, జూన్ 13న ఇజ్రాయెల్ ప్రారంభించిన బాంబు దాడుల పరంపరను ఒక పెద్ద తప్పిదంగా అభివర్ణించారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో, వివాదం మరింత విస్తృతమైన ప్రాంతీయ యుద్ధంగా మారవచ్చనే ఆందోళనలతో సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో చమురు ధరలు నాలుగు శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచ చమురు ఉత్పత్తిలో ఐదో వంతు రవాణా అయ్యే కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయకుండా నిరోధించడానికి చైనా సహాయం చేయాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కోరారు.

# అరాచకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

మొదటి పేజి తరువాయి




గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక కష్టనష్టాలకు గురయ్యారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో అధికారులు కూడా భయంతో విధులు నిర్వర్తించాల్సి వచ్చిందని, చివరికి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుని సైతం పలు రకాలుగా వేధించారని ఆయన గుర్తుచేశారు. "వైసీపీ పాలన చూసిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌కు అసలు భవిష్యత్తు ఉంటుందా అనే సందేహం కలిగింది. ఒకవేళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోయి ఉంటే రాష్ట్ర పరిస్థితి ఏమై ఉండేదో ఊహించడానికే భయంగా ఉంది. మాతో పాటు మా కుటుంబ సభ్యులను కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు" అని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే ఏకైక లక్ష్యంతో తామందరం కూటమిగా ఏర్పడి ముందుకు వచ్చామని ఆయన స్పష్టం చేశారు. తమ పోరాటాన్ని ప్రజలు గుర్తించి, ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ఆశీర్వదించారని తెలిపారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పకూలిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పవన్ కొనియాడారు. "ఈ ఏడాది కాలంలోనే రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించగలిగాం. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించింది. మేము గ్రామపంచాయతీలకు కేటాయించే నిధులను గణనీయంగా పెంచాం. 'పల్లెపండగ' కార్యక్రమం ద్వారా గ్రామీణ రహదారుల అభివృద్ధికి బాటలు వేశాం" అని ఆయన వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు సాగించిన అరాచకాలను, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఇంకా కొనసాగిస్తున్నారని పవన్ మండిపడ్డారు. "గొంతులు కోస్తామంటూ బెదిరింపులకు పాల్పడితే, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు. వైసీపీకి కనీసం ప్రతిపక్షానికి అవసరమైన సంఖ్యా బలం కూడా లేదు. అయినా వారి వైఖరిలో ఎలాంటి మార్పు రావడం లేదు" అని ఆయన విమర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. "మేము చట్టానికి లోబడి వ్యవహరించాలి కాబట్టి సంయమనంతో ఉంటున్నాం. ఎన్నో అవమానాలు, దెబ్బలు తిని ఈ స్థాయికి చేరుకున్నాం. ఎవరైనా పిచ్చివేషాలు వేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిని తొక్కి నారతీస్తాం" అని పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు.

# ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ కీలక రంగానికి సంబంధించిన విధానంపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే ఐదేళ్లలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఒక సమగ్రమైన నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగం ఎంతో కీలకమని, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా మరిన్ని సంస్థలను ఆకర్షించవచ్చని అభిప్రాయపడ్డారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేలా స్పష్టమైన కార్యాచరణతో, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకరంగా నూతన పాలసీ ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగంలో 23 సంస్థలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని, వీటి ద్వారా ఇప్పటికే సుమారు 22 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సమకూరాయని సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అనువైన వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్‌లతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతన పాలసీ ముసాయిదాను త్వరితగతిన పూర్తిచేసి, ఆమోదం కోసం కేబినెట్ ముందు ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# జగన్‌కు మానవత్వమే లేదు... ఉంటే సింగయ్యను అలా వదిలేసి వెళ్లరు!: షర్మిల

అమరావతి: పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో ఏటూకూరు బైపాస్ వద్ద జరిగిన దుర్ఘటనలో చీలి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్లక్ష్యమే కారణమని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఆరోపించారు. నేడు తిరుపతిలో విలేకరులతో మాట్లాడిన ఆమె, జగన్ వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జరిగిన తప్పిదానికి క్షమాపణ చెప్పాల్సింది పోయి, దానిని ఫేక్ వీడియో అంటూ ప్రచారం చేయడం దారుణమని ఆమె మండిపడ్డారు. "ఒక వ్యక్తి చనిపోతే, కనీసం మానవత్వం చూపకుండా, ఫేక్ వీడియో అని చెప్పి తప్పును కప్పిపుచ్చుకోవాలని చూడటం దారుణం. నిజంగా మానవత్వం ఉంటే, ఆ కుటుంబానికి 5 కోట్లో, 10 కోట్లో పరిహారం ఇచ్చి, వారిని క్షమించమని అడగాలి. ఐదేళ్లుగా ప్రజా సమస్యలను గాలికొదిలేసి, ఇప్పుడు ప్రజల మధ్యకు రావడం విడ్డూరంగా ఉంది" అని షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు కేవలం బలప్రదర్శన, జన సమీకరణ కోసమే తప్ప, ప్రజల సమస్యల పరిష్కారానికి కాదని షర్మిల విమర్శించారు. "తనకు డబ్బుంది, బలం ఉందని నిరూపించుకోవడానికే జగన్ ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి జన సమీకరణ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం అనుమతులు ఇవ్వకూడదని నేను డిమాండ్ చేస్తున్నాను" అని ఆమె స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న వారందరినీ విచారణకు పిలవాలని, కారు కింద ఒక మనిషి పడిపోయినా కనీసం పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోవడం అత్యంత దారుణమని ఆమె అన్నారు. "తప్పు జరిగినప్పుడు దాన్ని అంగీకరించాలి. అంతేగానీ ఫేక్ వీడియో అంటూ సమర్థించుకోవడం సరికాదు. జగన్ తన పర్యటనలో కారు సైడ్ బోర్డు మీద నిలబడి ప్రజలకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఆయన పర్యటనకు కేవలం 5 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటే, ఏకంగా 50 వాహనాలతో కాన్వాయ్‌గా వెళ్లి, నిబంధనలు ఉల్లంఘించి సైడ్ బోర్డుపై నిలబడటం జగన్ చేసిన తప్పు కాదా?" అని షర్మిల ప్రశ్నించారు. జగన్‌కు మానవత్వం అనే పదానికి అర్థమే తెలియదని, నిజంగా మానవత్వం ఉంటే సింగయ్యను ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి ఎందుకు తరలించలేదని, ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ఆమె నిలదీశారు. బాధిత సింగయ్య కుటుంబానికి జగన్ కనీసం 10 కోట్ల రూపాయల పరిహారం తక్షణమే అందించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## కమిషన్లన్నీ మేడిగడ్డపైనే ఉంటాయి..
# సుంకిశాలపై ఉండవు: హరీశ్‌రావు

హైదరాబాద్: మేడిగడ్డకు ఒక నీతి.. సుంకిశాలకు ఇంకో నీతా అని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడగడ్డకు చిన్న మరమ్మతులు చేసి గోదావరి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశమున్నా చేయట్లేదన్నారు. భారాసను బద్నాం చేయాలనే సింగిల్ పాయింట్ అజెండాతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సుంకిశాల విషయంలో మాత్రం కాంగ్రెస్ లోపాలు ఎక్కడ బయటపడతాయోనని గుట్టు చప్పుడు కాకుండా మరమ్మతులు మొదలుపెట్టిందని తెలిపారు. "సుంకిశాల మీద నిపుణుల కమిటీ, విజిలెన్స్ కమిషన్, జ్యుడీషియల్ కమిషన్ విచారణ, ఎన్డీఎస్ఏ నివేదికలు ఉండవు. ఇవేవీ లేకుండానే మరమ్మతులు చేయిస్తున్నారు. అదే మేడిగడ్డలో రెండు పియర్స్ కుంగితే అన్ని కమిషన్ల విచారణలు ఉంటాయి. ఎన్డీఎస్ఏ, నిపుణుల కమిటీ, విశ్రాంత ఇంజినీర్లు, ఇంకా వివిధ సంస్థలు ఆ పియర్స్‌కు మరమ్మతులు చేయమని ప్రభుత్వాన్ని అభ్యర్థించినా.. నిర్మాణ కంపెనీ సిద్ధమని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. కేవలం రాజకీయ స్వార్థంతో తెలంగాణ ప్రయోజనాలను కూడా పక్కకు పెట్టడం కాంగ్రెస్ మార్కు 'ప్రజా వ్యతిరేక-ప్రతిపక్ష వేధింపు'పాలనకు నిదర్శనం"అని హరీశ్‌రావు అన్నారు.

# రైతుభరోసా సంబరాలు చేపట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

## త్వరలో తెలంగాణలో కొత్త క్రీడా పాలసీ: జయేశ్ రంజన్

హైదరాబాద్: ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయన్నారు. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుభవార్త చెబుతుందని చెప్పారు. ఈరోజు జరిగే తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం త్వరలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న కొత్త క్రీడా పాలసీకి ఆమోదం తెలపనుందని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలామందికి న్యాయం జరగలేదన్నారు. వారికి త్వరలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, పారా ఒలింపిక్ పతక విజేత దీప్తి జివాంజీ పాల్గొన్నారు.

# 'సుపరిపాలనలో తొలి అడుగు'...




అమరావతి: రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఏపీలో కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా, 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట అమరావతిలో నేడు ప్రత్యేక సదస్సును నిర్వహించారు. రాజధాని అమరావతిలోని సచివాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక ఈ కార్యక్రమానికి వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సదస్సు ద్వారా గత ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణ, రెండో ఏడాది లక్ష్యాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాలనలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాఖాధిపతులు (హెచ్వోడీలు), అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. అంతేకాకుండా, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు కూడా ఈ సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని విశ్లేషిస్తూనే, రాబోయే సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశం ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పెంచడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు పంపిణీ ఆలంపల్లి జంగయ్య, విప్లవ కుమార్



యాచారం సూర్య న్యూస్( జూన్ 23):. మండల పరిధిలో మంతన్ గౌరెల్లి లో భారత విద్యార్థి ఫెడరేషన్,( %ంటఐ%) భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ( డివైఎఫ్ఐ) కమిటీల ఆధ్వర్యంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ నిర్వహించారు. సోమవారం ఈ కార్యక్రమంలో భాగంగా ఆలంపల్లి జంగయ్య, కె విప్లవ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారు కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు పాఠశాలకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇచ్చి, ప్రభుత్వ పాఠశాలలను దివాలా తీసే పరిస్థితి వస్తుందని వారన్నారు. ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నిరంతరం విద్యార్థి సమస్యల పైన, నిరుద్యోగ సమస్యల పైన పోరాటం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో కనీసం సౌకర్యాలు లేవని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతంపై కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపిటిసి కే తాగు నాయక్, అరవింద్ నాయక్, చందు నాయక్, కే కుమార్, పట్టు జంగయ్య, ఎస్ఎఫ్ఐ గ్రామ కార్యదర్శి ఎస్ భాస్కర్, డివైఎఫ్ఐ గ్రామ ఉపాధ్యక్షులు కే గణేష్,కందుల శ్రీరాములు, ఉపాధ్యాయులు, విజయలక్ష్మి , సుజాత, కృష్ణయ్య, వనం భాస్కర్, మౌలాల్ ,సతీష్, అంగన్వాడి టీచర్లు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత కెసిఆర్ దే

**ఎమ్మెల్యే రంగారెడ్డి ఆరోపణ -పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**పల్లెల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం**

**ప్రతి గ్రామంలో నీటి సమస్య లేకుండా పరిష్కరించాలి అధికారులకు ఆదేశాలు జారీ**



యాచారం సూర్య న్యూస్ (జూన్ 23):. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత కెసిఆర్ దే అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. సోమవారం మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఎమ్మెల్యే ప్రారంభించారు. మాల్ లో అండర్ డ్రైనేజ్, సిసి రోడ్లకు 83 లక్షలు, తమ్మలోని గూడ 44 లక్షలు, నల్లవెల్లి 49 లక్షలు, చింతపట్ల 20 లక్షలు, మంతన్ గౌరెల్లి 40 లక్షలు మొత్తం 21 పనులు 236,55 కోట్లు అండర్ డ్రైనేజ్, సిసి రోడ్లు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోలేదని , గ్రామాలు అభివృద్ధికి పడిందని ఎమ్మెల్యే విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యమని ఆయన చెప్పారు. యాచారం మండలంలో ప్రతి గ్రామంలో నీటి సమస్య లేకుండా పరిష్కరించాలి అని ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులకు, గ్రామ సెక్రెటరీలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సెక్రెటరీలు ప్రజా సమస్యల పైన దృష్టిని సారించాలని ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. మహిళలకు బస్సు ఫ్రీ, ఉచిత కరెంటు, రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు భరోసా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై కల్లబొల్లి మాటలతో చెప్పడం ఆయన తప్పు పట్టారు. ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పించన్లు, ప్రభుత్వం



ఇస్తుందని ప్రజలందరికీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, శేఖర్ మామ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్క నరసింహ, మార్కెట్ డైరెక్టర్ గులాం అక్బర్, భూపతి గల్ల మైపాల్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ అంగోత్ వెంకటేష్, మాజీ సర్పంచులు, పడకంటి శేఖర్ గౌడ్, లిక్కి పాండు రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్, మోటే శ్రీశైలం, అరవింద్ నాయక్, కక్కునూరి అమృత సాగర్, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిల్లా కంటి శేఖర్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, మూడెడ్ల వెంకట్ రెడ్డి, గ్రామ పార్టీల అధ్యక్షులు కానమోని జంగయ్య, పెండ్యాల యాదగిరి, కడారి యాదయ్య, పాశం జయప్రకాష్, గౌరారం వెంకట్ రెడ్డి, ఇటికాల లక్ష్మారెడ్డి, ఉప్పల భాస్కర్, బట్టు శ్రీనివాస్, గొల్లపల్లి భాస్కర్ గౌడ్, గొరిగె హరికిషన్, తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా ఊపందుకున్న రైతుబంధు ఉద్యమం



ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య జూన్ 23 : ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో సోమవారం రైతుబంధు ఉద్యమం మొదలైంది. రైతులు, బి ఆర్ ఎస్ నేతలు మూకుమ్మడిగా గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎన్నికలముందు లేనిపోని వాగ్దానాలు ఇచ్చి నెరవేర్చకపోవడంతో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసిన రైతులు. రైతు భరోసా ఎగ్గొడితే కాంగ్రెస్ నేతలకు శంకరగిరిమాన్యాలే అంటున్న రైతన్నలు. ఇప్పటికే రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ఈసారి ఇచ్చే వాళ్లకు కూడా సగంసగమేనని, రైతులందరికీ రైతు భరోసా ఇచ్చే వరకు భారీ ఎత్తున పోరాటం చేస్తామంటున్నా రైతన్నలు. ఈకార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు రైతులు, బిఆర్ఎస్ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ని మర్యాదపూర్వకంగా కలిసిన జైపాల్ నాయక్

శాలువాతో ఘనంగా సన్మానం



యాచారం సూర్య న్యూస్ (జూన్ 23):. తెలంగాణ రాష్ట్ర క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నూతనంగా మంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.. శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీస్ డెవలపర్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకము కలిసి పుష్ప గుచ్ఛంతో ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జ్యోతి జయపాల్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాల్వాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలలో పశువులకు సంబంధించిన ఆడి పరిశ్రమ పోషణం ప్రోత్సాహం లాంటి తదితర అంశాలపై చర్చించారు. రైతులకు సబ్సిడీపై గట్టి విత్తనాలు మందులు సబ్సిడీ ఇచ్చే విధంగా చూడాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ చీఫ్ సుజాత, రాయి యాదగిరి, జవహర్లాల్, విజయ్, భారత్, సుమన్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయంపై మక్కువ చూపాలి.




చింతపల్లి, ప్రభాత సూర్య జూన్ 23 : ప్రకృతి నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువుల పట్ల మక్కువ చూపాలని ప్రకృతి వ్యవసాయ విధాన సాధకులు, ప్రచారకులు విజయరామ్, డాక్టర్ జయచంద్ర మోహన్ లు అన్నారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక సాయిసన్నిధి మందిర ఆవరణలో రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా భూమిని నమ్ముకొని పూర్వికులు వ్యవసాయ పద్ధతులను పశుపోషణతో పొలంలో భూమిపై పశువుల ఎరువులను వెదజల్లి ఎలాంటి రసాయన ఎరువులను వాడకుండా భూసారమంతంతో వ్యవసాయం చేసే వారిని, నేడు పత్తి లాంటి వాణిజ్య పంటలు దేశవ్యాప్తంగా వ్యాపించడంతో రైతులు సేంద్రియ ఎరువులను మరిచి, రసాయనక ఎరువులపై శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. దీనికి తోడు సరైన వర్షాభావ పరిస్థితులు సమృద్ధిగా లేకపోవడంతో మూడు నెలలలో వచ్చే వాణిజ్య పంటలపై మక్కువ చూపుతున్నారన్నారు. వీటితో భూమిపై రసాయన ఎరువులు వాడితేనే పంట చేతికి వస్తుందనే భావన రైతుల్లో ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పంట మార్పిడి విధానం లేకపోవడంతో భూమిలో సారవంతం కోల్పోయి రైతులు వేసిన ఇతర పంటల్లో నష్టం చవి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది అన్నారు. ఆనాటి వ్యవసాయ రైతులు పాడి పశువులు, గేదెలు, బర్రెలు, గోవులు,మేకలు, గొర్రెలను, ప్రతి ఒక్కరు వాటిని సాదుకొనే వారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ



యంత్రాలు రావడంతో గ్రామాలలో అరకలు కట్టి దున్నే రైతులు కరవవుతున్నారన్నారు. ఈ వ్యవసాయ విధానం ద్వారా రైతులు పండించే పంటల గింజలు మనం తీసుకొని బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి ఎన్నో రకాల అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నామన్నారు. భూమిపై మానవుడు ఆరోగ్యంగా ఉండాలంటే పాత వ్యవసాయ పద్ధతులను అవలంబించి సేంద్రియ ఎరువులను వాడి పంటలు పండించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ గ్రామాలలో గోసంరక్షణ సమృద్ధిగా పెంచుకొని వ్యవసాయ పొలాల్లో గోవు పేడను, పొలాలలో వేసి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. మానవాళి మనుగడకు గోసంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సరియైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. అంతేకాకుండా కురిసిన వర్షపు నీరు వృధా పోకుండా వరద కట్టలు నీటి కుంటలు ఏర్పరచుకొని వర్షపు నీటిని పొదుపు చేసుకోవాలన్నారు. అలా చేసుకున్నట్లయితే భూమిలో కాలుష్యం తగ్గి సరైన పంటలు పండించేందుకు సుముఖంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ ఎన్ శివకుమార్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యుగంధర్ రావు, చింతపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిని శ్రావణ కుమారి చింతపల్లి షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనంజయ, ఆలయ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి కోమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, గోశాల సంరక్షణ కార్యదర్శి కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళశ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ లు, వివిధ గ్రామాల రైతులు ప్రజలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మునగనూరులో ఆక్రమణలపై ఫిర్యాదులు

**అక్రమ వెంచర్లతో చెరువు కబ్జా**

**కాలువలపై అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు**

**సాగు నీరుకు ఇబ్బందులు పడుతామంటున్న రైతులు**




తుర్కయంజాల్-ప్రభాత సూర్య: రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ వెంచర్లు రైతుల పాలిట శాపంగా మారాయి. మునుగనూరు గ్రామం దిలావర్ ఖాన్ చెరువు నుంచి వెళ్లే రెండు కాలువలు కబ్జాకి గురవుతున్నాయి. దీనిపై మునగనూరు , ఇంజపూర్ గ్రామానికి చెందిన కొంతమంది ప్రజలు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం డిఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీ, వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలసి పరిశీలించారు. చెరువుకి ఆనుకొని ఉన్న ఇంజాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 73లో ఉన్న భూమిని పరిశీలించారు. ఆ భూమిలో వెంచర్ చేస్తున్నారని ఫిర్యాదు అందిదని తెలిపారు. మంగళవారం ఇరిగేషన్ అధికారులతో పాటు హైడ్రా అధికారులు కూడా ఇంజాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 73లో ఉన్న ఫుల్ ట్యాంక్ లెవెల్ హద్దులను కూడా పరిశీలించనున్నట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు కాలువల కబ్జాలపై అనేక సార్లు రైతులు ఫిర్యాదు చేశారు. కాలువపై కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టడాన్ని నివేదించారు. ఐతే అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తరాల నుంచి పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందిస్తున్న చెరువులు, కుంటలు కబ్జాకు గురవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులు కళ్ళు తెరిచి కాలువలను కాపాడాలని మునుగనూరు గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమంగా ఇళ్లు నిర్మించిన వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం

**వీటి నగర్ మాల్,కురుమేడు**

**పాఠశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన.**



చింతపల్లి, ప్రభాత సూర్య జూన్ 23 : చింతపల్లి మండలం మాల్ వీటి నగర్, కురుమేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ పై వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యాంటీ నార్కోటిక్స్ డిఎస్పి పి.బిక్షపతి రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు కూలంకషంగా వివరించారు.చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు.యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు.ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, వీటి నగర్ కురుమేడు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎస్సై ముత్యాల రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణికి (76) ఫిర్యాదులు





రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ప్రభాత సూర్య జూన్ 23 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమేపరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (76) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ 31, ఇతర శాఖలకు 45, మొత్తం 76 దరఖాస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ వన మహోత్సవం లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధితశాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్దంగా ఉంచాలని, అవసరమైన మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచాలని, నాటిని ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. జిల్లాలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ శాఖాధికారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ప్రభాకర్ సూర్య జూన్ 23 : జిల్లాలోని రైతులకు ఎక్కడా ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ అధికారులు డీలర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు కావలసిన ఎరువులను సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరం లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు ఆయా మండలాల్లో పండే పంటలు, వాటి విస్తీర్ణనానికి ఏ మేరకు ఎరువుల అవసరం అవుతాయని ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని కావాల్సిన ఎరువులను ఆయా కంపెనీల డీలర్లతో మాట్లాడి గోదాములలో నిల్వ ఉంచాలని అన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లు 600 చ. అడుగులు మించొద్దు

త్వరగా పూర్తి చేసుకో వాలి లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సూచన

సొంత ఖర్చులతో 18 మందికి సిమెంట్ పంపిణీ

క్కి పాండురంగారెడ్డి నీ అభినందించిన ఎమ్మెల్యే



యాచారం సూర్య న్యూస్ ( జూన్ 23):. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిస్మాతకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలో చింతపట్ల గ్రామములో లిక్కి రంగారెడ్డి సొంత ఖర్చులతో ఇందిరమ్మ లబ్ధిదారులకు 18 మందికి సిమెంట్ బస్తాలు ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే లిక్కి రంగారెడ్డిని అభినందించారు. పేదలకు సహాయం చేయడంలో మంచి మనసుండాలని అన్నారు. ప్రజలందరూ సద్వినియం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు

షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, కేశంపేట్ సిఐ బి.నరహరి



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 23): మత్తు పదార్థాలను ఉపయోగించవద్దని గ్రామాలలోని ప్రజలకు తెలియ తెలియజేయాలని, సైబర్ క్రైమ్ గురించి అవగాహన పెంచుకోండి, అని షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మరియు మత్తు పదార్థాలు డ్రగ్స్, లాంటి వి సేవించరాదు, హరితహారం అవగాహన కార్యక్రమం లో ఏసిపి పాల్గొని మాట్లాడుతూ.. సమాజంలోఎవరైనా మత్తు డ్రగ్స్ పదార్థాలు సేవించిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, నేరాలు చేసిన వారికి సూచనలుఇవ్వాలి వినకపోతే మీ పాఠశాల టీచర్లకు గానీ



పోలీసులకు తెలియజేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం యాంటీ డ్రగ్స్ పైన కఠినంగా వ్యవహరించాలని సూచించిన విషయం తెలిపారు. పోలీసులు సమాజంలో అన్ని పనులు చేయాలంటే విద్యార్థులు గ్రామంలో ప్రజలు సాయ సహకారాలు అందించాలి అన్నారు. విద్యార్థులందరికీ సైబర్ క్రైమ్ గురించి, డ్రగ్స్ బారిన విద్యార్థులు, ప్రజలు పడకుండా కొన్ని సూచనలు చేశారు. సైబర్ క్రైమ్ మరియు యాంటీ డ్రగ్స్ కోసం, విద్యార్థులు మరియు ప్రజలు తమ చుట్టూ ఉన్న వారిని సురక్షితంగా ఉంచడానికి మరియు నేరాలను నివారించడానికి అనేక సూచనలు జారీ చేశారు. సైబర్ క్రైమ్ నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి, తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దు, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు అలాగే యాంటీ డ్రగ్స్ కోసం, మీ మీ స్నేహితులతో ఒకరికొకరు మత్తు పదార్థాల, సైబర్ నేరాల గురించి చర్చించుకోవాలని, సాక్ష్యాధారాలు ఉంటే వాటిని పోలీసులకు తెలియజేయండి మరియు మత్తు పదార్థాలను ఉపయోగించవద్దని ఇతరులను ప్రోత్సహించండి. సైబర్ క్రైమ్ గురించి అవగాహన పెంచుకోండి, మత్తు పదార్థాల వినియోగం లేదా అమ్మకాల గురించి మీకు తెలిస్తే, దానిని ఉపాధ్యాయులకు గాని పోలీసులకు తెలియజేయండి మీ పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అనంతరం హరితహారం గురించి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే మోటార్ సైకిల్ పై ప్రయాణించే ప్రజలు హెల్మెట్ ధరించాలని సలహాలు ఇవ్వాలని అన్నారు. హరితహారం లో భాగంగా అనంతరం పాఠశాల ఆవరణలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ నరహరి, ఎస్సై రాజకుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, వెంకటప్రసాద్, శంకర్, గోవర్ధనచారి, గోవర్ధన్, శ్రీలత, ఇందిరా, సునీత ,శారద, రామకృష్ణ (సి ఆర్ పి), ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొహరం పండుగపై అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సమీక్ష



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రేట్, ప్రభాత సూర్య జూన్ 23 : ఈ నెల 27 నుంచి జరుగనున్న మొహరం పండుగ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మొహరం పండుగ పై ప్రతిమా సింగ్ సమీక్ష నిర్వహించారు. దర్గాల వద్ద నీటి వసతి, పారిశుద్ధ్యం సమస్య తలెత్తకుండా ఆయా మునిసిపాలిటీలు, గ్రామ పంచాయితీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో పాటు అవసరమయిన చోట వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, మొబైలు టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. దెబ్బతిన్న రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విగాతం కలుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాక వారికి తెలిపారు. అదే విధంగా వేడుకలు జరిగే ముఖ్యమయిన ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా వుండాలన్నారు. వేడుకల సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానికంగా ఉండే అధికారులను సంప్రదించాలని అదనపు కలెక్టర్ ఉత్సవాల నిర్వాకులకు సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగను ప్రశాంతగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నవీన్ రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి సురేష్ మోహన్, పలు శాకల ఆధికారులు పాల్గొన్నారు.

## పలువురు బిజెపి లో చేరిక కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అరుణమ్మ

మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 23): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో వార్డ్ మెంబర్ నుండి సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పిటిసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం కమ్మధనం గ్రామంలో అమ్మకు వందనం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా ముగించారు. అనంతరం ఎంపీ సమక్షంలో పలువురు టి ఆర్ ఎస్ పార్టీ నుండి బిజెపి పార్టీ లో చేరడం జరిగింది. వారికి ఎంపీ అరుణమ్మ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డ్ మెంబర్ నుండి సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు మెంబర్ వెంకటయ్య, కృష్ణ, జాకారం కృష్ణ, కిష్టయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర నాయకులు, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్ గౌడ్, నాయకులు, మోహన్ సింగ్, శ్యామ్ సుందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మరియు గ్రామ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం సాధించేది ఎందుకైనా? లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఏఈ మనిషా



హైదరాబాద్ -ప్రభాత సూర్య:తెలంగాణ వ్యాప్తంగా వరుసగా ఏసీబీ అధికారులు రైడ్స్ చేస్తూ లంచగొండి అధికారులను అరెస్ట్ చేస్తున్నారు. ఎంత మందిని అరెస్ట్ చేసిన కొంత మంది అధికారుల తీరు మాత్రం మారట్లేదు. ఇంకా టేబుల్ కింద చేయి చాపుతూనే ఉన్నారు. తాజాగా మరో అధికారిని లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది. రూ.15 వేలు లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఏఈ మనీషా ఏసీబీకి చిక్కింది. అంబర్‌పేట జీహెచ్ఎంసీ కార్యాలయంలో బిల్లులు ఆమోదం చేసేందుకు ఇంజనీర్ ఏఈ మనీషా రూ.20,000 లంచం డిమాండ్ చేసింది. బాధితుడి ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ కార్యాలయం పై ఏసీబీ రైడ్ చేసింది. ఇది వరకే రూ. 5 వేలు లంచం ఇచ్చాడు బాధిత కాంట్రాక్టర్. ఈ క్రమంలోనే ఏఈ మనీషా రూ.15,000 లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా, ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇటువంటి ఘటనలపై ఫిర్యాదు చేయడానికి ఏసీబీ తెలంగాణ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని సూచించారు. అంతేకాకుండా, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ) మరియు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని ఏసీబీ అధికారులు వివరించారు. లంచం గురించి సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, వారి భద్రతకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని ఏసీబీ స్పష్టం చేసింది. పట్టుబడిన ఏఈ మనీషాపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## అక్రమ బోర్ల పై చర్యలు తీసుకోవాలి - నీటి వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ మక్త మహబూబ్ పేట్ లో అక్రమంగా నడుస్తున్న నీటి బోర్ల పై చర్యలు తీసుకోవాలనీ గ్రామస్తులు శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు.' మక్తా గ్రామంలో కొంతమంది పెత్తం దారులు అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారనీ, ట్యాంకర్ల ద్దార నీళ్లు అమ్మడం ద్వారా గ్రామంలోనీ ఇండ్లల్లో ఉన్న బోర్లు ఎండి పొయి నీటికి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. గ్రామంలో గతంలో కొందరు అక్రమంగా వేల ఫీట్ల లోతులో బోర్లు వేసి నీటి వ్యాపారం చేయడం వల్ల, తమ ఇండ్లలో బోర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఎన్ క్లేవ్ లో ఓ ఇంటీ గేటు ముందు బోరు వేసి, ఇంటీ వెనుకవైపు సంపు కట్టి దాంట్లో నీటిని నింపి అక్కడి నుండి ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామం లో కూడా ఓ వ్యక్తి ఇలా చేయడం వల్ల కూడా తమ ఇండ్లలో బోర్లు ఎండి పోయి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అక్రమ నీటి వ్యాపారం చేయడం వలన గ్రామ ప్రజలకు నీటి కష్టాలకు గురిఅవుతున్నారు. కొత్తరా నీటి ట్యాంకరులను నిలిపివేసి వారి బోర్లను తీయించగలరనీ కోరారు. ట్యాంకర్లను నిలిపి వేసి, తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మక్తా లో తక్షణంమే అక్రమ నీటి వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం పై గతం లో ఎన్ని సార్లు పిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోలేరని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు కూడా చర్యలు తీసుకోకపోతే ఉన్నతాదికారుల ద్రుష్టికి తీసుకు పోయి, స్థానిక అధికారుల పై పిర్యాదు చేస్తామని అన్నారు. లేని యెడల ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

మల్దకల్ మండలం పరిధిలోని పాల్వాయి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, పీ ఏ సీ ఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి నాయకులు సీతారాం రెడ్డి, అజయ్, వెంకటన్న, కురుమన్న, జీవన్ రెడ్డి, ఎల్లప్ప, రంజిత్ ,మహేష్ వీరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను తక్షణమే మంజూరు చేయాలి

కొత్తగూడెం కార్పొరేషన్ లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలి

దోమల నివారణకు చర్యలు చేపట్టి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలి

కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాలు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచన మేరకు సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన ధర్నాలో సీతాలక్ష్మి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు

## వర్షాల కోసం ఆశగా అన్నదాతల ఎదురుచూపు

రుతుపవనాల ప్రభావం తో కురిసిన కొద్ది పాటి వర్షాలకి రైతులు తొందరగా దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతుకు ఆతరువాత వర్షాలు లేక వేసిన విత్తనాలు మొలకెత్తక రైతులు ఆశగా మబ్బుల వైపు చూస్తున్నారు. సాధారణంగా రోహిణి కార్తే లో రోళ్ళు పగిలి పోయె ఎండలు కొడతాయి, కానీ ఈసంవత్సరం అలా కాకుండా ఎండల తీవ్రత తక్కువగా ఉంది దానితో పాటు కురిసిన కొద్ది పాటి వర్షాలకు రైతులు ఆశగా ఈసారి ముందుగానే వర్షాలు కురిసే అవకాశం ఉందని తొందరగా వారి పంట చెనులను , చేలకలను దుక్కులు దున్ని చదును చేసి ఉంచుకున్నారు ,ఆతరువాత అధను చూసి పత్తి గింజలను,మొక్క జొన్న కూడా ఆశగా విత్తుకున్నారు,ఆతరువాత రైతులకు అసలు కష్టాలు మొదలైనాయి రుతుపవనాలు కదలిక లేకపోవడం మరియు వర్షాలు కురువకపోవడం వల్ల వేసిన పంటలు కూడా ఎండి పోయి కొద్ది మంది రైతులు పత్తి నీ చెడగొట్టి పెసర్లు వంటి పంటలను వేయడం తో పాటు మరికొద్ది మంది ఆశగా మళ్ళీ పత్తి గింజలను వేశారు అప్పటికి వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆశగా మబ్బుల వైపు చూస్తున్నారు.ఒకవైపు మాత్రం భావి పారకం తో కొంత మంది రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఇలానే వర్షాలు లేక పోతే తమ పరిస్థితి ఏంటని ,అన్నదాతలు తమ పంటలు ఎండి పోవలసినదేన అని తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.ఇకనైనా వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి:: అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

ప్రజలు గ్రీవిన్స్ లో పలు సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా... గూడూరు మండలం ఎపూరు గ్రామంలోని రేకులతండ కు చెందిన భానోత్ మోతిరాం గత 50 సంవత్సరాల నుండి సర్వే నెం.664/2 లో గల రెండున్నర ఎకరాల భూమిని తన పేరు మీద పట్టా చేసి ఇవ్వాలని కోరారు.మహబూబాబాద్ పట్టణంలోని కె.జి.బి.వి లో ఎస్.కె. షహీన్,పి.నాగమణి హెడ్ కుక్ అసిస్టెంట్ గా తాము కొంత కాలం పనిచేశామని అట్టి కాలానికి జీతం ఇంతవరకు ఇవ్వలేదని, అట్టి కాలానికి నా జీతాన్ని ఇప్పించగలరని కోరారు.గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన బానోత్ కృష్ణ చైతన్య తను నిరుద్యోగినని, తన బ్రతుకు దెరువుకు ఆధారంగా ఏదైనా ఉపాది కల్పించాలని కోరారు.మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన వంగూరి శ్రావంతి తను తన భర్త నుండి విడాకులు పొంది ఒంటరిగా పాపతో జీవిస్తున్నాని, పాపను పోషించుకోవడానికి బ్రతుకు దేరువుగా ఏదేని ఒక కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని ఇప్పించగలరని కోరారు. మరిపెడ మండలం నీలకుర్తి గ్రామం రేఖ్యా తండాకు చెందిన బానోత్ బాలు తనకు ఉన్న భూమి సర్వే నెంబర్ కొత్త పాస్ బుక్ లో ప్రభుత్వ భూమి అని పడిందని, అదే సర్వే నెంబర్ తో పాత పాస్ బుక్ లో పట్టా భూమి అని ఉండెనని, నాకు నా తల్లి తండ్రుల నుండి సంక్రమించిన వారసత్వ భూమి తన తమ్ముడి పాస్ బుక్ లో పట్టా భూమి అని తన పాస్ బుక్ లో ప్రభుత్వ భూమిగా పడిందని నా సమస్య పరిష్కరించి సరిచేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబందించి వచ్చిన ( 106 ) దరఖాస్తులను సబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కొరకు ఆదేశించారు.ఈ ప్రజావాణిలో జెడ్.పి సీ ఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, హౌసింగ్ డి.ఈ రాజయ్య, ఏ.డి.సర్వే ల్యాండ్ నరసింహ మూర్తి, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డి.పి.ఓ హరిప్రసాద్,డి.హెచ్.ఓ మరియన్న, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, ఎల్.డి.ఎం.సత్యన్నారాయణ మూర్తి, పెన్షన్ అధికారి శంకర్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, భాభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ బోర్ల పై చర్యలు తీసుకోవాలి

శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ మక్త మహబూబ్ పేట్ లో అక్రమంగా నడుస్తున్న నీటి బోర్ల పై చర్యలు తీసుకోవాలనీ గ్రామస్తులు శేరిలింగంపల్లి తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ..'మక్తా గ్రామంలో కొంతమంది పెత్తం దారులు అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారనీ, ట్యాంకర్ల ద్దార నీళ్లు అమ్మడం ద్వారా గ్రామంలోనీ ఇండ్లల్లో ఉన్న బోర్లు ఎండి పొయి నీటికి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. గ్రామంలో గతంలో కొందరు అక్రమంగా వేల ఫీట్ల లోతులో బోర్లు వేసి నీటి వ్యాపారం చేయడం వల్ల, తమ ఇండ్లలో బోర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఎన్ క్లేవ్ లో ఓ ఇంటీ గేటు ముందు బోరు

## డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

మొక్కలు నాటిన 124 బూత్ అధ్యక్షులు చాకలి మహేందర్

పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్

భారత దేశ ఐక్యత మరియు సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన నిజమైన దేశభక్తుడు. పోమల్ పల్లి స్కూల్ ఆవరణలో బూత్ అధ్యక్షులు మహేందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఒకే దేశంలో ఉండరాదని ఆర్టికల్ 370 వెంటనే రద్దు చేయాలనే ఉద్యమ క్రమంలో1953 జూన్ 23వ తేదీన బలిదానం కావడం జరిగింది. గొప్ప జాతీయవాద నాయకుడు, భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ , ఆయన కలలు కన్న ఏక్ భారత్ మరియు శ్రేష్ఠ భారత్ ను స్మరించుకోవాల్సిందిగా కోరుచునాను. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ మరియు అమ్మకు వందనం కార్యక్రమం లో భాగంగా కేశంపేట మండలం పోమాల్ పల్లి గ్రామంలో 124 బూత్ అధ్యక్షులు చాకలి మహేందర్ ఆధ్వర్యంలో చెట్లు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాకలి మహేష్, కంచుకోట శివశంకర్, కమ్మసిచ్చు ఉదయ్, అబ్బే సాయి, వినోద్, మహేష్, అనిల్, చందు పాల్గొన్నారు

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడుకోండి

జనసంఘ్ వ్యవస్థాపకులు డా" శ్యామప్రసాద్ ముఖర్జీ కి ఘనంగా నివాళులు

డా"శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఎలికట్ట గ్రామములో మొక్కలు నాటిన బీజేపీ నాయకులుఎంకనోళ్ల వెంకటేష్" బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

:స్వతంత్ర సమర యోధుడు అఖండ భారతాని కోసం ప్రాణాలు అర్పించిన భారత మాత ముద్దుబిడ్డ బీజేపీ పూర్వపు జనసంఘ్ వ్యవస్థాపకులు డా" శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదివాస్ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ ఎలికట్ట గ్రామములో బూత్ కమిటీ అధ్యక్షులు కొడవటి నర్సింలు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి ముక్య నాయకులు గా బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంకనోళ్ల వెంకటేష్ పాల్గొన్నారుకార్యక్రమంలో గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శివకుమార్ బీజేపీ ఫరూక్ నగర్ మండల కార్యదర్శి,గోనెల రాము,యాదగిరి,శ్రీనివాస్, తదితరులు ఉన్నారుఎంకనోళ్ల వెంకటేష్ " ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ పూర్వపు జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ ఎలికట్ట గ్రామములో బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు.అనిఅఖండ భారతావని కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప జాతీయ వాది శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని,ఆయన కన్న కలలు నేడు భారత ప్రధాని శ్రీ నరేంద్రమోదీ నెరవేరుస్తున్నారని తెలిపారు ఆయన వర్ధంతి నీ పురస్కరించుకొని మొక్కలు నాటడం చాలా సంతోషకరమని,మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని,రోజు రోజుకు చెట్లు అంతరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కలు నాటే కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని పేర్కొన్నారు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కు నివాళులు

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని డికె. బంగ్లాలో బిజెపి పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ.. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదని, ఆర్టికల్ 370 వెంటనే రద్దు చేయాలనే ఉద్యమ క్రమంలో 1953 జూన్ 23వ తేదీన బలిదానం కావడం జరిగిందని తెలిపారు. గొప్ప జాతీయవాద నాయకుడు, భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ప్రతి బూతులో ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, ఆయన కలలు కన్న ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ ను స్మరించు కోవాలని కోరారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ లో 11మొక్కలు నాటాలని, అందులో భాగంగా డికె బంగ్లా లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నర్సింలు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాసు, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్, జిల్లాఐటీ సెల్ కన్వీనర్ చిత్తారికిరణ్, గద్వాల మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు డబ్బిలేటి నర్సింహ, బిజెపి సీనియర్ నాయకులు ఢిల్లీవాల కృష్ణ, మోహన్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

## సుప్రజ ప్రవీణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మారబోయిన రవి యాదవ్

శేరిలింగంపల్లి:మసీద్ బండ నుండి సుప్రజ ప్రవీణ్ అన్న ను మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో సత్కరించి పులగుచ్ఛమిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మారబోయిన రవి యాదవ్. ఈ సందర్భంగా రవి యాదవ్ మాట్లాడుతూ ప్రవీణ్ అంటే ఒక పేరు కాదు ఒక వ్యవస్థ అతను చేసిన ఎన్ని మంచి పనులు మనము ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు అలాంటి మంచి వ్యక్తి,నాకు స్నేహితునిగా, రాజకీయ గురువుగా, నాకు వెనుక ఉంటూ నన్ను ముందుకు నడిపే మా ప్రవీణ్ కు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు మీరు ఇలాంటి పుట్టినరోజులు ఇంకెన్నో జరుపుకోవాలని కోటి కాంతుల చిరునవ్వులతో భగవంతుడు నీకు నిండు నూరేళ్లు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com

జనరల్ న్యూస్

మంగళవారం - 24 - జూన్ - 2025

## ఐదు నెలల గరిష్టాన్ని తాకిన చమురు ధరలు



సింగపూర్ : ఇరాన్ అణుకేంద్రాలపై ఇజ్రాయిల్, అమెరికా దాడుల తర్వాత సోమవారం చమురు ధరలు అత్యధిక స్థాయికి పెరిగాయి. జనవరి తర్వాత ఐదు నెలల గరిష్టాన్ని తాకాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్‌లో బ్యారెల్‌కు 1.92 డాలర్లు లేదా 2.49 శాతం పెరిగి 78.93డాలర్లకు చేరుకుంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 1.89 డాలర్లు లేదా 2.56శాతం పెరిగి 75.73డాలర్లకు చేరుకుంది. రెండు సంస్థలు సెషన్ ప్రారంభంలో 3శాతం కంటే ఎక్కువ పెరిగి వరుసగా 81.40డాలర్లు మరియు 78.40డాలర్లకు చేరుకున్నాయి. ఇరాన్ ప్రధాన అణు కేంద్రాలను ధ్వంసం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారాంతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ ఒపెక్‌లో మూడవ అతిపెద్ద ముడి చమురు ఉత్పత్తిదారుగా ఉంది. దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు సరఫరాలో ఐదవ వంతుగా ఉన్న హార్మూజ్ జలసంధిని మూసివేసింది. జలసంధిని మూసివేసే చర్యను ఇరాన్ పార్లమెంట్ ఆమోదించిందని స్థానిక మీడియా వెల్లడించింది. దీంతో చమురు ధరలు పెరగవచ్చని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు మౌలిక సదుపాయాలకు నష్టం కలిగించే ప్రమాదాలు చాలా రెట్లు పెరిగాయని స్పార్టా కమోడిటీస్ సీనియర్ విశ్లేషకులు జున్ గో%ఎ% పేర్కొన్నారు. కీలక జలమార్గం ద్వారా చమురు ప్రవాహాన్ని ఒక నెలపాటు సగానికి తగ్గించినట్లయితే బ్రెంట్ బ్యారెల్‌కు 110 డాలర్ల వద్ద గరిష్ట స్థాయికి చేరుకోవచ్చని మరియు తదుపరి 11 నెలల పాటు 10శాతం తగ్గుదల ఉండవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ పేర్కొన్నారు.

## మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం
## అమరావతిలో 10 సంస్థలకు భూ కేటాయింపులు



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపుల కోసం ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘం భేటీ అయ్యింది. 16 అంశాలను అజెండాలో చేర్చగా..అందులో 12 అజెండాలకు అమోదం తెలిపింది. ఇవాళ సమావేశంలో 10 సంస్థలకు కొత్తగా భూ కేటాయింపులకు అమోదం తెలపగా, మరో రెండు సంస్థలకు గడువు పొడిగించారు. ప్రస్తుతం అమరావతిలో టెండర్లు దక్కించుకున్న అన్ని సంస్థలు పనులు ప్రారంభించాయని..ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపుల కోసం ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం అయ్యింది. మంత్రి నారాయణతో పాటు భరత్ హాజరుకాగా.. జూమ్ ద్వారా మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ హాజరయ్యారు. 2014- 19 కాలంలో రాజధాని లో భూములు కేటాయించిన సంస్థల్లో నాలుగు సంస్థలకి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సెంటర్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్‌కు రెండు ఎకరాలు కేటాయింపు. జుయాలజీకల్ ఆఫ్ సర్వే సంస్థకు రెండు ఎకరాలు,స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు ఐదు ఎకరాలు,ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కు మూడు ఎకరాలు.. ఈ నాలుగు సంస్థలకు గతంలో కేటాయించిన భూ కేటాయింపులను మరోసారి కొనసాగించాని అమోదం తెలిపింది. 2014-19లో భూములు కేటాయించిన గెయిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అంబికా అగర్‌బత్తి కి అనుమతుల రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు రెండు ఎకరాలు, ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు రెండు ఎకరాలు,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 0.4 ఎకరాలు, ఇంటిలిజెన్స్ బ్యూరో కి 0.5 ఎకరాలు, బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్‌కి 0.5 ఎకరాలు చొప్పున కొత్తగా ఆరు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సబ్ కమిటి నిర్ణయం తీసుకుంది.

## గుజరాత్‌లో ఆప్, కేరళలో కాంగ్రెస్ విజయం



**న్యూఢిల్లీ,:** దేశ వ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గుజరాత్, కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు వచ్చాయి. గుజరాత్‌లో రెండు స్థానాలకు బైపోల్స్ జరిగాయి. విశావదర్, కడి రెండు స్థానాలకు కౌంటింగ్ నిర్వహించారు. తాజా ఫలితాల్లో బీజేపీ ఒకటి, ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కొక్క స్థానాన్ని గెలుచుకున్నాయి. ఇక కేరళలోని నీలంబర్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పంజాబ్‌లోని లూథియానా వెస్ట్, పశ్చిమ బెంగాల్‌లోని కలిగంజ్ స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో జూన్ 19న పోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. కౌంటింగ్ ప్రారంభమైన దగ్గర నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు విజయం దిశగా సాగిపోయారు. విశావదర్‌లో ఆప్ అభ్యర్థి గోపాల ఇటాలియా విక్టరీ సాధించగా.. కడిలో బీజేపీ అభ్యర్థి రాజేంద్ర చావ్డా విజయం సాధించారు. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ నిలంబూర్ నియోజకవర్గంలో విజయం సాధించింది. ఇక భారత ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ప్రకారం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్.. లూథియానా వెస్ట్‌లో కూడా ముందంజలో ఉంది. ఇక మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్.. కాలిగంజ్‌లో విజయం దిశగా వెళ్తోంది. గుజరాత్, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లలో ఒక్కొక్క స్థానంలో ప్రస్తుత శాసనసభ్యులు మరణించగా.. కేరళ, గుజరాత్‌లో ఇద్దరు శాసనసభ్యులు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. కేరళలోని నిలంబూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంపై వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఆర్యదాన్ షౌకత్‌ను ప్రియాంక అభినందించారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) దార్శనికతపై నమ్మకం ఉంచినందుకు నిలంబూర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మద్దతుతో ఆర్యదాన్ షౌకత్ పార్టీని ముందుకు నడిపించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక గుజరాత్‌లో ఆప్ విజయం సాధించడం పట్ల ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కార్యకర్తల మనోధైర్యాన్ని పెంచుతుందన్నారు. ఇక పంజాబ్‌లో కూడా విజయానికి దగ్గరగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది ప్రతి కార్యకర్తకు సంతోషకరమైన విషయంగా తెలిపారు.

## ఏసీబీ దాడులకు రంగం సిద్ధం?
### తుర్కయంజాల్, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పై ఏసీబీ గురి..!
### దాడులు జరిగే అవకాశం

ప్రభాత -సూర్య తెలంగాణ బ్యూరో : తెలంగాణ వ్యాప్తంగా వరుసగా ఏసీబీ అధికారులు రైడ్స్ చేస్తూ లంచగొండి అధికారులను అరెస్ట్ చేస్తున్నారు. ఎంత మందిని అరెస్ట్ చేసిన కొంత మంది అధికారుల తీరు మాత్రం మారట్లేదు. ఇంకా టేబుల్ కింద చేయి చాపుతూనే ఉన్నారు. ఇప్పటికే అనేక ఆఫీసుల్లో దాడులు చేసింది. ఒక్క ఈ ఏడాదిలోనే 122కు పైగా కేసులు నమోదు అయ్యాయి. ఇందులో భాగంగా ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తుర్కయంజాల్, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీల పై ఏసీబీ దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రతిరోజు కార్యాలయా చుట్టూ అధికారులు చక్కర్లు కొడుతున్నట్లు సమాచారం. వాటిపై ఫిర్యాదులు అందాయా? లేక.. మాములుగానే తనిఖీ చేయనుందా? అని సస్పెన్స్ గా ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులందరూ..రావులే...

- కేటీఆర్ అమెరికా పర్యటనలో ప్రభాకర్ రావు కలిశారా?
- ప్రభాకర్ రావు భారత్ తిరుగు పయనం పక్కా ప్లాన్ ప్రకారం జరిగిందా?
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక మలుపు.
- బీఆర్ఎస్ నేత ప్రభాకర్ రావుకు కేసు అంశంపై బ్రీఫింగ్ చేశారా?
- సిట్ అధికారులు ఏం తేల్చనున్నారు?




ప్రభాతా సూర్య -తెలంగాణ బ్యూరో: తెలంగాణలో ఫోన్ ట్యాప్ కేసు కీలక మలుపులు తీరుగుతోంది. రోజుకో నేతను విచారిస్తున్న సిట్ అధికారులు, మరోవైపు నిందితులపై ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. సాక్షులుగా బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకుంటూనే...వారు చెప్పిన అంశాల ఆధారంగా నిందితులు ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, రాధా కిషన్ రావు సహా పలువురిని ప్రశ్నిస్తున్నారు. ఐతే కేటీఆర్ ఫోన్ ట్యాప్ చేయించారని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ...ఒక విషయాన్ని వారంతా చూసిచూడనట్టు వదిలేసినట్టు కనిపిస్తోంది. అదే కేటీఆర్ అమెరికా పర్యటన తర్వాత ప్రభాకర్ రావు ఇండియా రావడం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేవలం రాజకీయ లబ్ధికోసమే చేశారని...ఇప్పటి వరకు అనుమానాలు వ్యక్తం అవుతుండగా...అనేక రంగాల్లో ఉన్న ప్రముఖ వ్యక్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఫోన్ ట్యాప్ వ్యవహారంలో సిట్ ఏం తేల్చుతుందనేది తర్వాతి విషయం. కానీ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు మాత్రం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేవలం 2023 ఎన్నికల సమయంలో మాత్రమే జరిగిందని మొన్నటి వరకు వినిపించిన విమర్శలు...ఇప్పుడు 2018లో జరిగాయనే వరకు వచ్చాయి. అధికారం కోసం ఆ పార్టీ చేసిందని ఆరోపిస్తున్నారు. కానీ ఇతర ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటని చర్చ జరుగుతోంది. అధికారంలో ఉంటే ఇంత దిగజారాలా? అని చీదరించుకుంటున్నారు.

### కీలకంగా వ్యవహరించింది ఆ సామాజిక వర్గం వ్యక్తులే...

ఇదిలా ఉంటే...ఈ వ్యవహారంలో ఉన్న నిందితులందరూ..రావులే. వెల్మలను పెట్టుకొని..ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించిన...వెంటనే ప్రధాన నిందితులుగా ఉన్న వ్యక్తి అమెరికా పారిపోవడం, ఇతర అధికారులు ఆధారాలను ధ్వంసం చేయడం వంటివి ఎన్నో జరిగాయి. ఐతే ప్రభాకర్ రావుకు అమెరికా ఆశ్రయం దొరకకపోవడం, తిరిగి తెలంగాణకు రావాల్సిన తప్పని పరిస్థితి ఏర్పడింది. కానీ ఆయన తెలంగాణకు రావడానికి ముందు...ఇవాళ వస్తారు, రేపు వస్తారనే వార్తలు హల్ చల్ చేశాయి.

### కేటీఆర్ అమెరికా పర్యటన తర్వాత ఇండియాకు ప్రభాకర్ రావు రాక

ప్రభాకర్ రావు రాకకు సంబంధించి వచ్చిన వార్తలన్నీ ఓ పథకంలో భాగంగానే ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. ఈ అనుమానాలు తలెత్తడానికి కారణం కేటీఆర్. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను ఎప్పుడూ లేని విధంగా బీఆర్ఎస్ అమెరికాలో జరుపుకోవాలని నిర్ణయించడం, అలాగే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుక జరిగిన నెల రోజుల తర్వాత అమెరికాలో ఉత్సవాలకు ప్రణాళికలు.....అన్ని ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కోసమే అని భావిస్తున్నారు విశ్లేషకులు.

### బీఆర్ఎస్ కీలక నేత ప్రభాకర్ రావుకు బ్రీఫింగ్ ఇచ్చారా?

ప్రభాకర్ రావు ఇండియా రావడం తప్పనిసరి కూడా అదే సమయంలో అయ్యింది. ప్రభాకర్ రావు ఇండియా రావడం ఆలస్యం అవడానికి కేటీఆర్ పర్యటన కారణంగా చెప్తున్నారు. కేటీఆర్ అమెరికా వెళ్ళిన తర్వాత అక్కడ ప్రభాకర్ రావు సమావేశం అయ్యారని...తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు అంశం చర్చించారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. వారిద్దరి మధ్య ఫోన్ ట్యాపింగ్ కేసు అంశంపై చర్చలు, కేటీఆర్ నుంచి ప్రభాకర్ రావుకు బ్రీఫింగ్, ఎలా వ్యవహరించాలో చెప్పిన తర్వాతే...భారత్ తిరిగి వచ్చారని చర్చ జరుగుతోంది. ప్రభాకర్ రావును కేటీఆర్ పర్యటన తర్వాతే ఇండియా రావడానికి సిద్ధమయ్యారని అంటున్నారు. ప్రభాకర్ రావు సిట్ విచారణకు హాజరవడం, అధికారులకు సమాధానాలు చెప్పడం వంటి అంశాలన్నీ అప్పటి ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని అంటున్నారు. ఐతే ఈ కేసులో సిట్ దూకుడుగా వ్యవహరిస్తోంది. రాజకీయ నేతలను సైతం ప్రశ్నిస్తోంది. విచారణలో సమయం గడిచిన కొద్ది....కేసు ఏ మలుపు తీరుగుతుందోనని ఆసక్తి నెలకొంది. మరి ఈ కేసులో సిట్ ఏ నిర్ణయానికి వస్తుందో చూడాలి.

# 25నిమిషాల్లో ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’

### ఇరాన్ అణు కేంద్రాలపై 14 బంకర్-బస్టర్ బాంబులు జారవిడిచాం
### అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ కెయినీ వెల్లడి




వాషింగ్టన్: ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా చేపట్టిన ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’ విజయవంతమైందని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డేనియల్ కెయినీ చెప్పారు. ఈ మొత్తం ఆపరేషన్ కేవలం 25 నిమిషాల్లోనే ముగిసిందని తెలిపారు. ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ సైన్యానికి ఇరాన్‌లో గగన తల రక్షణ వ్యవస్థ నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురు కాలేదని, ఆపరేషన్ పూర్తయిన వెంటనే తమ విమానాలు క్షేమంగా తిరిగివచ్చా యని స్పష్టం చేశారు. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామ ర్‌లో ఏడు స్టెల్త్ బి-2 బాంబర్లు పాల్గొన్నాయని తెలిపా రు. ఈ బాంబర్లు 14 భారీ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ బాంబులను(బరువు 13,600 కిలోలు) ఫోర్డో, నతాంజ్ అణు కేంద్రాలపై జారవిడిచాయని పేర్కొన్నారు. అలాగే టోమాహాక్ క్షిపణులు ఇస్ఫహాన్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేశాయని వివరించారు.

### ఏడు బి-2 స్పిరిట్ బాంబర్లు

“2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత బి-2 స్టెల్త్ బాంబర్లు ఈ స్థాయిలో భారీ ఆపరేషన్‌లో పాల్గొనడం ఇదే మొదటిసారి. మిస్సోరీ నుచి బాంబర్లు బయలుదేరాయి. అమె రికా కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 6.40 గంటలకు మూడు అణు కేంద్రాలపై దాడులు మొదల య్యాయి. 7.05 గంటలకు మా విమానాలు ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేశాయి. 14 బంకర్-బస్టర్ బాంబులు, 24కుపైగా టోమాహాక్ క్షిపణులు ప్రయో గించాం. పశ్చిమాసి యాలో ఇటీవల ఉద్రిక్తతలు ప్రారంభమైన అనంతరం ఇరాన్‌పై మా అతిపెద్ద దాడి ఇదే. ఏడు బి-2 స్పిరిట్ బాంబర్లతో విరుచుకుపడ్డాం. ఒక్కోదాంట్లో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. నిశ్శబ్దంగా వెళ్లి పని పూర్తి చేసుకొని వచ్చారు.

### కొద్దిమందికే తెలుసు

ఇరాన్‌పై ఆపరేషన్ గురించి అమెరికా ప్రభుత్వ ముఖ్యుల్లో, సైనిక వ్యూహకర్తల్లో చాలా కొద్దిమందికే తెలుసు. అమెరికా జలాంతర్గామి నుంచి ఇస్ఫహాన్ అణు కేంద్రంపై 24కుపైగా టోమాహాక్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైళ్లు ప్రయోగించాం. ఉపరితలంపైనున్న మౌ లిక సదుపాయాలను నేలమట్టం చేశాం. సాయంత్రం 6.40 గంటలకు బి-2 బాంబర్లు రెండు భారీ బంకర్-బస్టర్ బాంబులను ఫోర్డో న్యూక్లియర్ సైట్‌పై జారవిడిచాయి. మిగిలిన బాంబర్లు వాటి లక్ష్యాలను విజయవంతంగా ఛేదించాయి. చివరి దాడి ఇస్ఫహాన్‌పై టోమాహాక్ క్షిపణితో జరిగింది. రాత్రి 7.05 గంటల కల్లా ఆపరేషన్ ముగిసింది. ఇరాన్‌కు చెందిన సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థ మా యుద్ధ విమానాల రాకను గుర్తించలేదు” అని డాన్ కెయినీ వివరించారు.

### ఆపరేషన్ విజయవంతం: పీట్ హెగ్సెత్

ఇరాన్‌పై ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్’ పూర్తిస్థాయిలో విజయవంతమైందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. మూడు ఇరాన్ అణు కేంద్రాలు నాశనమయ్యాయని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు దక్కించుకోవడానికి వీల్లేదని డొనాల్డ్ ట్రంప్ మొదటనుంచీ చెబుతూనే ఉన్నారని గుర్తుచేశారు. ఇరాన్‌తో యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదన్నారు. ఇరాన్ ప్రభుత్వం చర్చలకు ముందుకు వస్తుందని భావిస్తున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. చర్చలకు ఇరాన్‌ను ఒప్పించాలంటూ డొనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటివరకు 430 మంది మరణించారని, 3,500 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని నౌర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది మృతిచెందారని, 1,272 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు.

### ఏమిటీ టోమాహాక్ క్షిపణులు?

అమెరికా నావికా దళంలో కీలకమైనవి బీజీఎం-109 టోమాహాక్ ల్యాండ్ అటాక్ లాంగ్‌రేంజ్ మిస్సైళ్లు. యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి వీటిని అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో భూఉపరితలంపైనున్న లక్ష్యాలపై ప్రయోగించవచ్చు. 1970వ దశకంలో తొలిసారిగా జనరల్ డైనమిక్స్ కంపెనీ తయారుచేసింది. 12కుపై వేరి యంట్లు ఉన్నాయి. టోమాహాక్ క్షిపణి బరువు 1,300 కిలోలు. బూస్టర్‌తో కలిపి రూ.1,600 కిలోలు. పొడవు 5.56 మీటర్లు గంటకు 920 కిలోమీటర్లకుపైగా వేగంతో ప్రయాణించి 2,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదు.

### మాట వినకపోతే మళ్లీ దాడులు: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌లో కీలకమైన అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశామని, శిథిలా లుగా మార్చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మూడు అణు కేంద్రాలపై అమెరికా సైన్యం దాడులు చేసిన అనంతరం శనివారం రాత్రి ట్రంప్ వైస్‌హౌస్‌లో మాట్లాడారు. అమెరికాపై ప్రతీకార దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను హెచ్చరించారు. శాంతి కావాలో, యుద్ధం కావాలో తేల్చుకోవాలని ఆ దేశానికి సూచించారు. భీకర స్థాయి దాడులతో ఇరాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పే శక్తి అమెరికాకు మాత్రమే ఉందన్నారు. పశ్చిమాసియాలో ఇరాన్ ఒక దుష్టశక్తిగా మారిందని, ఇతర దేశాలకు ప్రమాదకరంగా పరిణమించిందని మండిపడ్డారు. మాట వినకపోతే ఇకపై జరగబోయే దాడులు మరింత భయాన కంగా ఉంటాయని ఇరాన్‌కు తేల్చిచెప్పారు.

### ట్రంప్ నిర్ణయం అద్భుతం: నెతన్యాహూ

జెరూసలేం: ఇరాన్ అణు కేంద్రాలపై అమె రికా దాడి చేయడం పట్ల ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెత న్యాహు హర్షం వ్యక్తంచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. శాంతి కోసమే ఇరాన్‌పై బలప్రయోగం చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ దాడులతో పశ్చిమాసియాలో రాబోయే రోజుల్లో శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం, భద్రత చేకూరుతాయని స్పష్టంచేశారు. నెతన్యాహు ఆదివారం మీడియాతో మాట్లాడారు. చరిత్రను మలుపు తిప్పే నిర్ణయం తీసుకుందని అమెరికాను కొనియాడారు. ప్రపంచంలో ఏ దేశం కూడా చేయలేని సాహసోపేత కార్యాన్ని అమెరికా చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలతో ప్రాణాంతక శక్తిగా మారిన ఇరాన్‌కు బుద్ధి చెప్పిన గొప్ప నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్‌ను చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఉద్ఘాటించారు.

బాధ్యతారాహిత్యం

అమెరికాపై రష్యా ధ్వజం

మాస్కో/బీజింగ్: ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై భారీ బాంబులతో అమెరికా జరిపిన దాడిని రష్యా తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే అనేక సంక్షోభాలతో అట్టుకుతున్న పశ్చిమాసియాను మరింత ప్రమాదంలోకి నెట్టడమేనని పేర్కొంది. అమెరికా తన బాధ్యతారాహిత్యంతో అంతర్జాతీయ చట్టాలు, ఐరాస పీఠికను, తీర్మానాలను ఉల్లంఘించిందని మండిపడింది. ‘ఒక సార్వభౌమ దేశంపై క్షిపణులు, బాంబులతో దాడులు చేయడం బాధ్యతారహిత చర్య. దీనిని సమర్థించుకునేందుకు ఎన్ని వాదనలు వినిపించినా సరే, ఇది అంతర్జాతీయ చట్టాలకు ఐరాస చార్టర్, భద్రతా మండలి తీర్మానాలను తీవ్రంగా ఉల్లంఘించడమే. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగిన దేశం ఈ దాడులు చేయడం ఆందోళనకరం’అని అమెరికా పేరును ప్రస్తావించకుండా పేర్కొంది. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరి కా బాంబు దాడులను చైనా సైతం తీవ్రంగా ఖండించింది. ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికా పశ్చిమాసియాలో ఉద్రిక్తత లను మరింత రాజేసిందని పేర్కొంది.

# ఆ 3 అణు కేంద్రాలు

### ఇరాన్‌లోని కీలకమైన మూడు అణు కేంద్రాలపై అమెరికా సైన్యం అనూహ్యంగా దాడులకు దిగిన నేపథ్యంలో వాటి గురించి క్లుప్తంగా...

1.ఫోర్డో యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్

టెహ్రాన్‌కు నైరుతి దిశలో 60 మైళ్ల దూరంలో పర్వతం అంతర్భాగంలో 90 మీటర్ల లోతున ఫోర్డో అణుశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. నతాంజ్ కంటే ఇది పరిమాణంలో చిన్నదే. వైమానిక దాడుల నుంచి రక్షణతోపాటు అణుపరీక్షల గురించి బాహ్య ప్రపంచానికి తెలియకూడదన్న ఉద్దేశంతో కొండ దిగువన దుర్భేద్యంగా నిర్మించారు. ఫోర్డోను ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమ దేశాలు లక్ష్యంగా చేసుకోవడానికి కారణం ఇది పటిష్ట స్థితిలో ఉండడంతోపాటు ఇక్కడ పెద్ద సంఖ్యలో అత్యాధునిక సెంట్రీఫ్యూజ్‌లను బిగించే సామర్థ్యం కలిగి ఉండడం. ఫోర్డోలో సైతం 60 శాతం శుద్ధి చేసిన యురేనిజం నిల్వలున్నాయి. ఈ అణుకేంద్రంపై అమెరికా సైన్యం బి-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ ద్వారా 30,000 పౌండ్ల బరువైన బంకర్ బస్టర్ (జీబీయూ-57) బాంబును ప్రయోగించినట్లు సమాచారం. ఈ దాడి వల్ల ఫోర్డోకు ఏ మేరకు నష్టం వాటిల్లిందన్నది ఇంకా తెలియరాలేదు. పర్వత ప్రాంతం భారీగా దెబ్బతినడంతోపాటు రంగు మారినట్లు ఉపగ్రహ చిత్రాలను బట్టి తెలుస్తోంది. అమెరికా దాడి చేయడం తథ్యమన్న ముందస్తు అంచనాతో ఫోర్డో నుంచి యురేనియం, సెంట్రీఫ్యూచ్‌లు, కీలక పరికరాలను ఇరాన్ అధికారులు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఇరాన్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

2. నతాంజ్ న్యూక్లియర్ ఫెసిలిటీ

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయ దిశలో 135 మైళ్ల దూరంలో నతాంజ్ అణుకేంద్రం ఉంది. ఇరాన్‌కు ఇదే అత్యంత ముఖ్యమైన యురేనియం శుద్ధి, నిల్వ కేంద్రం. అణు కార్యక్రమంలో నతాంజ్‌దే కీలక పాత్ర. అమెరికా దాడుల కంటే ముందు ఇక్కడ 60 శాతం శుద్ధి చేసిన యురేనియం నిల్వచేశారు. అణు బాంబు తయారు చేయాలంటే 90 శాతం శుద్ధి చేసిన యురేనియం అవసరం. అంటే అణు బాంబు తయారీకి ఇరాన్ చాలా సమీపంలోకి వచ్చిందనే చెప్పొచ్చు. అమెరికా దాడుల కంటే ముందే ఇజ్రాయెల్ సైన్యం నతాంజ్‌పై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో భూఉపరితలంపై ఉన్న మౌలిక సదుపాయాలు చాలావరకు ధ్వంసమయ్యాయి. భూఅంతర్భాగంలో ఉన్న పటిష్ట స్థితిలో సదుపాయాలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కానీ, అమెరికా దాడుల్లో నతాంజ్‌లోని సెంట్రీఫ్యూజ్‌లు, ఇతర పరికరాలు చాలావరకు నామారూపాల్లేకుండా పోయినట్లు తెలుస్తోంది. నతాంజ్‌పై గతంలోనూ పలుమార్లు దాడులు జరిగాయి. అవి సఫలం కాలేదు. నతాంజ్‌కు సమీపంలోని పికాక్స్ అనే పర్వతం కింద మరో భారీ అణుకేంద్రాన్ని నిర్మించడానికి ఇరాన్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు గతంలో వార్తలొచ్చాయి.

3. ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్

టెహ్రాన్‌కు ఆగ్నేయ దిశలో 215 మైళ్ల దూరంలోని ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌లో యురేనియం కన్వర్షన్ సదుపాయాలు, ల్యాబ్‌లు, చైనా తయారీ రియాక్టర్లు ఉన్నాయి. ఇక్కడ వేలాది మంది అణు శాస్త్రవేత్తలు పని చేస్తుంటారు. ఇటీవల ఇజ్రాయెల్ సైన్యం ఇస్ఫహాన్ అణుకేంద్రంపై దాడికి దిగడంతో కొన్ని భవనాలు దెబ్బతిన్నాయి. కానీ, అమెరికా దాడిలో భారీ నష్టమే వాటిల్లినట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల్లో ఇస్ఫహాన్‌లో రేడియేషన్ లీకేజీ అయినట్లు ఎలాంటి సమాచారం రాలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ప్రకటించింది.

ఇరాన్‌లోని మరికొన్ని అణు కేంద్రాలు (ఇక్కడ దాడులు జరగలేదు)

బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్

ఇరాన్‌లో ఇదొక్కటే కమర్షియల్ అటామిక్ రియాక్టర్. పర్షియన్ గల్ఫ్‌లో ఏర్పాటు చేశారు. రష్యా సరఫరా చేస్తున్న యురేనియంతో ఇక్కడ అణ్వస్త్ర తయారీ పరిశోధనలు జరుగుతుంటాయి.

అరాక్ హెవీ వాటర్ రియాక్టర్

పెవన్స్-గ్రేడ్ ప్లుటోనియం ఉత్పత్తి చేయడానికి అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ నెలకొల్పారు. 2015లో ఈ కేంద్రాన్ని పాక్షికంగా ఆధునీకరించారు.

టెహ్రాన్ రీసెర్చ్ రియాక్టర్

‘శాంతి కోసం అణుశక్తి’ అనే కార్యక్రమంలో భాగంగా 1967లో అమెరికా సరఫరా చేసిన టెక్నాలజీ, పరికరాలతో టెహ్రాన్ రీసెర్చ్ రియాక్టర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ తక్కువ శుద్ధి చేసిన యురేనియంతో అణు పరిశోధనలు జరుగుతున్నాయి

సంపాదకీయం

## ఔషధాల తయారీలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యం

## (విశ్లేషణ)

భారత్ నుంచి వచ్చే ఫార్మాస్యూటికల్స్‌తో సహా అనేక కేటగిరీల దిగుమతులపై **25%** టారిఫ్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం అనేక ప్రకంపనలకు దారితీస్తోంది. ఇలాంటి ప్రతీకార సుంకాలవల్ల భారత్‌లోని ఫార్మారంగానికి ఎదురయ్యే సమస్యలు ఎలా ఉన్నా అమెరికా ఆరోగ్య భద్రతా వ్యవస్థకే ఎక్కువ నష్టం కలుగుతుందని అనేక మంది నిపుణులు ఉదహరిస్తున్నారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో జనరిక్, భారీ డ్రగ్స్, వ్యాక్సిన్లు, కేన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమయ్యే బయోసిమిలర్స్ ఉంటాయి. అమెరికాలో ప్రిస్క్రైబ్ చేసిన సగానికి మించి జనరిక్ ఔషధాలు భారత్‌నుంచి ఎగుమతి అవుతున్నవే. భారత్, చైనా నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే అతి చవకైన జనరిక్ ఔషధాలవల్ల అమెరికా ఆరోగ్యభద్రతా వ్యవస్థ **2022**లో **408** బిలియన్ డాలర్ల వరకు ఆదా చేయగలిగింది. భారత్‌కు చెందిన **50** బిలియన్ డాలర్ల ఫార్మా పరిశ్రమకు చెందిన సగానికి సగం ఎగుమతులు ప్రపంచం మొత్తం ఎగుమతుల్లో మూడో స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ నుంచి దిగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులపై అత్యధిక సుంకాలు విధించడం కేవలం భారత ఔషధ కంపెనీలకే కాదు, అమెరికా ప్రజారోగ్య వ్యవస్థపై కూడా తీవ్ర పరిణామాల ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ పరిస్థితుల్లో భారత ఫార్మారంగం తాను ఉత్పత్తి చేసే ఔషధాల నాణ్యతలో ఎలాంటి కళంకం లేకుండా ఉన్నత ప్రమాణాలు పాటించవలసి ఉంది. గతంలో భారత్‌లో తయారైన ఔషధాలు రోగులపై దుష్పరిణామాలు కలిగిస్తున్నాయని విదేశాల్లో చెడ్డపేరు తీసుకొచ్చిన సంఘటనలు జరిగాయి. కామెరూన్, గాంబియా, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో పిల్లల మరణాలకు భారత్ నుంచి వచ్చిన ఔషధాల వాడకమే కారణమైందన్న అప్రతిష్ఠ వచ్చింది. గాంబియాలో దగ్గు, జలుబునుంచి ఉపశమనం పొందడానికి వాడే సిరప్‌లతో **66** మంది చిన్నారులు మృత్యువాతపడడం సంచలనం కలిగించింది. భారత్‌లో ఓ కంపెనీ తయారు చేసిన సిరప్‌లే చిన్నారులను బలి తీసుకున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఈ సిరప్‌ల వల్లనే అనేక మంది కిడ్నీలు దెబ్బతిన్నాయని పేర్కొంది. అంతేకాదు ఈ మందుల దుష్ఫలితాలపై ఇతర దేశాలను కూడా హెచ్చరించింది. భారత్‌లోని హర్యానాలో మైడెన్ ఫార్మా స్యూటికల్స్ తయారు చేసిన సిరప్‌లే చిన్నారులను బలిగొన్నాయని సాక్షాత్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ వెల్లడించడం చెప్పుకోతగ్గది. దీనిపై ఆనాడు భారత ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి చిన్నారుల మృతికి కారణమైన సిరప్‌లను ఆ సంస్థ అసలు భారత్‌లోనే విక్రయించలేదని, కేవలం విదేశాలకు ఎగుమతి చేయడానికే తయారు చేశారని ప్రకటించింది. దీన్ని బట్టి విదేశాలకు భారత్ నుంచి ఎగుమతి అవుతున్న ఔషధాల్లో నాణ్యత ఎంత లోపభూయిష్టంగా ఉంటోందో వెల్లడవుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్‌లో ఔషధాల తయారీ నాణ్యతపై దృష్టి కేంద్రీకరించవలసి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ట్రంప్ విధించిన **25%** టారిఫ్‌ల ప్రభావ అవకాశాలను దేశీయ ఔషధ పరిశ్రమ అర్థం చేసుకుంటున్న తరుణంలోనే మరో కళంకం తెరపైకి వచ్చింది. ముంబై కేంద్రంగా ఉన్న ఏవియో ఫార్మాస్యూటికల్స్ విదేశాల్లో అక్రమంగా ఔషధాలను విక్రయిస్తోందని బయటపడడం, దీనిపై దర్యాప్తు ప్రారంభం కావడం ఆలోచించవలసిన అంశం. ఈ కంపెనీ పశ్చిమాఫ్రికా దేశాల్లో తమకు విక్రయించే లైసెన్సు లేకున్నా ఓపియాయిడ్స్ (నల్లమందు గసగసాల మొక్కలో లభించే సహజ పదార్థాల నుంచి ఉత్పన్నమయ్యే ఔషధాలు)ను ఎగుమతి చేస్తున్నట్టు బిబిసి పరిశోధనలో బయటపడింది. ఈ నివేదికతో నైజీరియా, ఘనా, కోటే డి ఐవోయిర్ తదితర దేశాల ప్రజారోగ్యవ్యవస్థల్లో ఆందోళన చెలరేగింది. ఏవియో సంస్థ టాపెంటాడోల్ అనే స్ట్రాంగ్ ఓపియాయిడ్‌తో, కండరాల సడలింపునకు వాడే ఔషధం కారిసోప్రోడాల్‌తో కలిపి తయారు చేస్తున్నట్టు బయటపడింది. ఈ మాత్రల దిగుమతులను నైజీరియా **2018**లో నిషేధించిన తరువాత భారత్‌లో కూడా దీనిపై నియంత్రణ చర్యలు మరింత కఠినతరం చేశారు. అన్ని రకాల అనుమతులు లేని టాపెంటాడోల్, కారిసోప్రోడాల్ కాంబినేషన్ల ఎగుమతులకు క్లియరెన్స్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి **21**న ఇండియా డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉపసంహరించింది. అనేక సంవత్సరాలుగా భారత్‌లో తయారవుతున్న ఔషధాలు విషపూరితమని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అభ్యంతరాలు చెప్పడంతో విదేశాల్లో తిరస్కారం ఎదురైంది. ఔషధాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, సమగ్రత లోపించిన డేటా, నిబంధనల ఉల్లంఘన ఫలితంగా ఔషధ ఉత్పతులు చెల్లుబాటు కావడంలేదు.

# ఇంజనీరింగ్ కోర్సుపై అనాసక్తి

### - ఆసక్తి చూపని విద్యార్థులు - తక్కువ ప్లేస్మెంట్ రేటే కారణం




దేశంలోని సాంకేతిక రంగంలో ఇంజినీరింగ్ విద్య అనేది చాలా కీలకం. ప్రపంచంతో పోటీ పడే విధంగా దేశ భవిష్యత్తును ఈ కోర్సులు తీర్చి దిద్దుతాయనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అంతేకాదు.. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎక్కువ జీతాలతో ఉద్యోగాలను పొందేందుకు దారిని కూడా చూపిస్తాయి. అందుకే.. గత కొన్నేండ్ల క్రితం వరకు ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ ఎక్కువ. ఈ కోర్సుల్లో చేరటానికే విద్యార్థులు ఆసక్తి చూపేవారు.

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యార్థుల ఆలోచన తీరు మారింది. ఒకప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎన్రోల్మెంట్ ఎక్కువగా ఉండేది. ప్లేస్మెంట్ రేట్లు కూడా చక్కగానే ఉండేవి. అయితే, భారత్లోని ఇంజినీరింగ్ కాలేజీలలో మాత్రం ఎన్రోల్మెంట్, ప్లేస్మెంట్ రేట్లు తగ్గాయి. ఒకప్పుడు వెలుగువెలిగిన ఇంజి నీరింగ్ కోర్సులు.. ఇప్పుడు వెలవెలబోతున్నాయని విద్యావేత్తలు, నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. భారత్లో టెక్నికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సమాచారమూ ఇదే విషయాన్ని వివరిస్తుండటం గమనార్హం. దేశంలో ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గిందనీ, గత కొన్నేండ్లుగా ఇదే పరిస్థితి ఉన్నదని ఏఐసీటీఈ డేటా వివరిస్తున్నది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన వృత్తి విద్యగా ఇంజినీరింగ్ కోర్సుకు మంచి గౌరవం, డిమాండ్ ఉండేది. అయితే, గత కొన్నేండ్లుగా మాత్రం ఈ కోర్సులో చేరేవారి సంఖ్య మాత్రం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2023-24 మధ్య మూడువేలకు పైగా ప్రభుత్వ అనుబంధ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలలో 64 లక్షల సీట్లకు గానూ 45.50 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు రెండు లక్షల బీటెక్ సీట్లు అంటే 30 శాతం భర్తీ కాకుండా ఖాళీగానే ఉన్నాయి. ఇంజినీరింగ్ కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటానికి గల ప్రధాన కారణం.. తక్కువ ప్లేస్మెంట్లేనని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు. అలాగే, మంచి కెరీర్ను అందించే ఇతర కోర్సులూ అందుబాటులోకి రావటమూ ఈ పరిస్థితికి దారి తీసిందని అంటున్నారు. అంతేకాకుండా, అధిక ఫీజులు, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, పలు ప్రయివేటు కాలేజీలలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం వంటి అంశాలను ఇతర కారణాలుగా నిపుణులు వివరిస్తున్నారు.

ఏఐసీటీఈ మెంబర్ సెక్రెటరీ రాజీవె కుమార్ మాట్లాడుతూ.. ప్రయివేటు ఇన్స్టిట్యూట్లలో సీట్లు తరచూ ఖాళీగా ఉంటాయని అన్నారు. ప్రత్యేకించి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న సంస్థల్లో ఈ పరిస్థితి ఉంటుందని చెప్పారు. టైర్2, టైర్ 3 నగరాల్లో ఉపాధి అవకాశాలను కల్పించటం తాము పరిష్కరిస్తున్న సవాళ్లలో ప్రధానమైనదని వివరించారు. దీని ఫలితంగా విద్యార్థులు ఇంజినీరింగ్ అడ్మిషన్ల కోసం పెద్ద నగరాలకు వెళ్లటాన్ని నిరోధిస్తుందని చెప్పారు. ఫలితంగా.. ఈ నగరాల్లో ఉండే ఇంజినీరింగ్ కాలేజీలలోని సీట్లు భర్తీ అవుతాయని వివరించారు. సమస్యను పరిష్కరించటం కోసం.. బీటెక్తో పాటు బీబీఏ, బీసీఏ వంటి అదనపు ప్రోగ్రామ్లను ఆఫర్ చేస్తున్న గ్రామీణ ప్రాంతాల్లోని ఇన్స్టిట్యూషన్లను ప్రోత్సహించటానికి, కోర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏఐసీటీఈ స్కాలర్షిప్లను ప్రవేశపెడుతన్నదని రాజీవె కుమార్ చెప్పారు

### తగ్గిన ప్లేస్మెంట్లు

ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్మెంట్లు సవాల్గా మారాయి. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2022-23 మధ్య దాదాపు 34.30 లక్షల మంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరారు. అయితే, 16.4 లక్షల మందికి, అంటే 47.7 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్లేస్మెంట్లో విజయం సాధించటం గమనించాల్సిన అంశం.

# డబుల్ ఇంజిన్ సర్కారు ఎలా ఉంటుందో చూపించాం

అమరావతి: డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలో ఉంటే ఎలా ఉంటుందో చూపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుఅన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆయన.. అన్నీ చేసేశామని చెప్పట్లేదని, ఊహించిన దానికంటే ఎక్కువే చేశామని తెలిపారు. ఏడాది పాలన సందర్భంగా అమరావతిలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పదవి తనకు కొత్తకాదని.. నాలుగుసార్లు సీఎం అయినట్లు గుర్తు చేశారు. ప్రతిసారీ సమర్థంగా పరిపాలించి సుపరిపాలన అందించానన్నారు. "మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నా ఎలాంటి సమస్య రాలేదు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా చెప్పిన మాట నిలబెట్టుకుంటాం. సుపరిపాలన అందించేందుకు అధికారులు కూడా కలిసి రావాలి. వైకాపా ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది. మూడు రాజధానుల నమూనాతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. మూడు ముక్కలాటతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. పోలవరం పూర్తయితే రాష్ట్రానికి నీటి సమస్య సమసిపోతుంది. 2022-23కు నీతిఆయోగ్ నివేదిక ప్రకారం రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. వైకాపా హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారు.


అధికారంలోకి రాగానే వాటిపైనే సంతకం చేశా

అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు పెట్టాను. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. వైకాపా హయాంలో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్థం చేశారు. వాటిని సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. 213 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నాం. విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసింది. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం.. పూర్తి చేస్తాం. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ పనులు జరుగుతున్నాయి. 'తల్లికి వందనం' హామీని పూర్తిగా నిలబెట్టుకున్నాం. అడ్మిషన్లు పూర్తయ్యాక ఒకటో తరగతి, ఇంటర్ విద్యార్థులకూ ఇస్తాం.

12.2 శాతం వృద్ధిరేటు సాధించాం

90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తున్నాం. సౌరశక్తి ఉత్పత్తి, వినియోగంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఆదరణ కింద ఎస్సీలు, బీసీలకు అండగా ఉన్నాం. హంద్రీనీవాకు ఒకే ఏడాది రూ.3,800 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పించాం. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ పేరుతో నియోజకవర్గానికో కేంద్రం ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక ఆంత్రపెన్యూర్ రావాలి. అనేక కష్టాలున్నా.. 12.2 శాతం వృద్ధి రేటు సాధించాం. విజయవాడ, విశాఖ మెట్రోలకు అనుమతులు వస్తున్నాయి. మద్యం, ఇసుక విధానాలు కొత్తవి తెచ్చాం. ముందుకొచ్చిన పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటివరకు 31 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చాం.

ముఠా తగాదాలు తుదముట్టించాం



రాయలసీమలో ముఠా తగాదాలు తుదముట్టించాం. వైకాపా హయాంలో గంజాయిని పెంచి పోషించారు. మేం వచ్చాక గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించాం. గంజాయి పండించినా, అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. రాజకీయ ముసుగులో నేరాలు చేయాలంటే నావద్ద కుదరవు. మేం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు తీర్చాం. సమస్యలు అధిగమించేలా కార్యాచరణ తయారు చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాలను అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో అమలు చేయాలి. కొత్త రోడ్లు వేశాం. పాడైన రోడ్లకు మరమ్మతులు చేశాం. వచ్చే మూడేళ్లలో అమరావతిని ఒక స్థాయికి తీసుకెళ్తాం. ప్రారంభోత్సవానికి మళ్లీ మూడేళ్లలో రావాలని ప్రధాని మోదీని కోరాం.

బనకచర్లతో ఇబ్బందేం లేదు

గోదావరి మిగులు జలాలు రెండు రాష్ట్రాలూ వాడుకోవచ్చు. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయి. ఎంతగా వాడుకున్న 200 టీఎంసీలు మాత్రమే వాడుకోగలం. బనకచర్ల వద్ద ఎవరికీ ఇబ్బంది లేదు. గోదావరి జలాల వినియోగంతో 2 రాష్ట్రాలు బాగుపడతాయి. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తాం. కోస్తాంధ్రను ఆక్వా కల్చర్ హబ్‌గా మారుస్తాం. ప్రజలపై ధరల భారం పడకుండా ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. అదే రోజున ఆటో డ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తాం.

సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ధనవంతుడు ఇంకా ధనికుడు అవుతున్నాడు. పేదవాడు ఇంకా పేదరికంలోకి వెళు తున్నాడు. మనతో పుట్టినవాళ్లు ఇంకా పేదరికంలోనే ఉన్నారు. సమాజం అండతోపైకి వచ్చినవారు తిరిగి సమాజానికి ఇవ్వాలి. బిల్‌గేట్స్ తన సంపదలో 99శాతం తిరిగి సమాజానికి ఇస్తున్నారు. సరైన సమయంలో సరైన సాయం చేస్తే.. అనేక మంది పైకి వస్తారు. పీ-4ను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నా. ఈ కార్యక్రమంలో ధనికులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు భాగస్వాములు కావాలి. రూ.9.34 లక్షల విలువైన ఎంవోయూలు చేశాం. కంపెనీలు వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పెట్టుబడిదారులకు వివిధ రకాల రాయితీలు ఇస్తున్నాం. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

స్వర్ణాంధ్ర-2047 కోసం యంత్రాంగం సిద్ధం

స్వర్ణాంధ్ర-2047 అమలు కోసం యంత్రాంగం సిద్ధం చేశాం. ఏపీలో ప్రస్తుతం తలసరి ఆదాయం రూ.2.6 లక్షలు ఉంది. 2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలు కావాలి. యోగా డేను ఘనంగా నిర్వహించుకున్నాం. ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుంటే మన పనులు కూడా ఆ దిశగా ఉంటాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో జనాభా బాగా పెరుగుతోంది. మిగతా రాష్ట్రాల్లో పెరగడం లేదు. పిల్లలు భారం కాకూడదు.. వాళ్లను ఆస్తిగా పరిగణించాలి. ఇవాళ ఎక్కడ చూసినా చిన్న కుటుంబాలే కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీ తగ్గింది. ఒకసారి జీఎస్‌డీపీ పెరిగితే నిరంతరం రెవెన్యూ పెరుగుతుంది. 2029 నాటికి తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ బాగా పెరగాలి.

### ఇదే జోరు కొనసాగిద్దాం

మారిన ఆహార అలవాట్లను పరిశీలించి పంటలు పండించాలి. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వాటికి మంచి ధర వస్తోంది. నియోజకవర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎంపీలు కృషి చేయాలి. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ప్రణాళికలు ఉండాలి. ప్రజాప్రతినిధులంతా పని చేయాల్సిందే.. తప్పించుకోవడం సాధ్యం కాదు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 503 సేవలు అందిస్తున్నాం. త్వరలోనే 703కి పెంచుతాం. ఇప్పుడు చేయాల్సింది హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్. ఈ ఏడాది చేసిన పనులను మరో నాలుగేళ్లు కొనసాగిద్దాం. మనిషికి తనకున్న శక్తిసామర్థ్యాలపై అనుమానం ఉంటుంది. కానీ, తెలివితేటలను ఆచరణలో పెడితేనే అద్భుతాలు జరుగుతాయి" " అని చంద్రబాబు అన్నారు.

# వాళ్లు 5 ఏళ్లలో సాధించలేనిది మేం ఏడాదిలో సాధించాం!

అమరావతి: జూన్ 4... రాష్ట్ర చరిత్రను మార్చిన రోజు, ప్రజాస్వామ్యం గెలిచిన రోజు... బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం గొప్పతనం ఏంటో మరోసారి తెలిసిన రోజు అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కూటమి పాలనకు ఏడాది నిండిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లోకేశ్ ప్రసందించారు. అందరూ కూటమి గెలిచింది, టీడీపీ గెలిచింది, జనసేన గెలిచింది, బీజేపీ గెలిచింది అంటున్నారు... గెలిచింది కూటమి కాదు గెలిచింది ప్రజలు అని స్పష్టం చేశారు. 94 శాతం స్ట్రైక్ రేట్.. 175కి 164 స్థానాలులతో ప్రజలు రికార్డులు బద్దలు కొట్టారు... చరిత్రను తిరగరాశారు... ఇది ప్రజా విజయం అని లోకేశ్ అన్నారు. వాళ్లు ఐదేళ్లలో సాధించలేనిది మనం ఏడాదిలో సాధించాం. అన్ని సమస్యలు పరిష్కరించేసాం అని నేను చెప్పడం లేదు. ఇంకా చెయ్యాల్సింది ఎంతో ఉంది. గత ప్రభుత్వానికి వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పట్టింది. మన చంద్రన్న కేవలం ఒకే ఒక్క సంతకంతో పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచారు. దేశంలో ఏ రాష్ట్రము 4 వేల పెన్షన్ ఇవ్వడం లేదు. దివ్యాంగులకు 6 వేలు, పూర్తిగా బెడ్ కే పరిమితం అయితే 15 వేలు ఇస్తున్నాం. 67,27,164 మంది విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసాం. 8745 కోట్లు తల్లుల ఖాతాల్లో వేసాం. మొదటి తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం లో చేరే విద్యార్థులకు త్వరలోనే పథకాన్ని అమలు చేస్తాం.

### అరాచకపాలనపై తిరుగుబాటు... ప్రజలకు స్వేచ్ఛ

ఐదేళ్లు అరాచక పాలన సాగింది. ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, కేసులు, అరెస్టులు. విధ్వంస పాలన పై ప్రజలు తిరగబడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు. సుపరిపాలనలో మనం తొలి అడుగు వేసాం. ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వారు ప్రజా ప్రభుత్వం ఏడాదిలో ఏం సాధించింది అని అడుగుతున్నారు. నేను వారికి సూటిగా సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు ప్రశాంతత వచ్చింది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల మొఖంలో చిరునవ్వు వచ్చింది. ప్రజా సంఘాలకు ప్రశ్నించే హక్కు వచ్చింది. నియంత పాలన నుండి ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్

గత ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటిన్లు మూసేసారు. ప్రజా ప్రభుత్వం 203 అన్న క్యాంటిన్లు తిరిగి ప్రారంభించింది. దీపం పథకం ద్వారా కోటి సిలిండర్లు ఉచితంగా మహిళలకు అందజేశాం. గత ప్రభుత్వం ఒక్క డిఎస్సి పోస్టు కూడా భర్తీ చెయ్యలేదు. ప్రజా ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తూ మెగా డిఎస్సి నిర్వహిస్తున్నాం. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆగష్టు 15న మహిళలకు ఫ్రీగా బస్సు ప్రయాణం అమలుచేస్తాం. గత పాలకులు ప్రజల ఆస్తులు కొట్టేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తే దానిని మన ప్రజా ప్రభుత్వం రద్దు చేసింది. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేస్తే మన ప్రజా ప్రభుత్వం చెత్త పన్ను ఎత్తేసింది.

పేదరికంలేని సమాజం బాబు లక్ష్యం

పేదరికం లేని సమాజం చూడాలనేది చంద్రబాబు గారి లక్ష్యం. పీ4 కాన్సెప్ట్ తీసుకొచ్చారు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడమే పీ4. బంగారు కుటుంబాలకు చేయూత అందిస్తున్న మార్గదర్శులకు నా ధన్యవాదాలు. పవనన్న ఆధ్వర్యంలో పంచాయతీలకు స్వాతంత్ర్యం వచ్చింది. పంచాయితీలకు వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసాం. రైతుల నుండి 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం, 13,600 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో పెట్టిన 1700 కోట్ల బకాయిలు కూడా మనమే తీర్చాము. పొగాకు, మిర్చి, కోకో రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటుంది ప్రజా ప్రభుత్వం. డబుల్ ఇంజిన్ సర్కార్ మన పవర్. ప్రధాని నరేంద్ర మోదీ గారు రాష్ట్రం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. గత ప్రభుత్వం నాశనం చేయాలనుకున్న అమరావతిని డబుల్ స్పీడ్ తో పట్టాలెక్కించాం, 60వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. రాజధానికి 15వేల కోట్లు, పోలవరానికి 12వేల కోట్లు ఇచ్చారు ఏడాదిలోనే పోలవరం పనులు 8శాతం పూర్తి చేశాం, విశాఖ స్టీల్ ప్లాంట్ కి 11,500 కోట్లు సాయం అందించారు. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్ ల అభివృద్ధికి 5వేలకోట్లు ప్రకటించారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సహకరించారు. కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు కు సహకరిస్తున్నారు. ఐదేళ్ల లో గత ప్రభుత్వం సాధించలేనివి ప్రజా ప్రభుత్వం ఏడాదిలో సాధించింది. డబుల్ ఇంజన్ సర్కారు వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయి.

విద్యాశాఖలో సంస్కరణలు

విద్యా శాఖ మంత్రిని నా శాఖ లో సంస్కరణలు తెస్తున్నా. రాజకీయాలకు అతీతంగా విద్య వ్యవస్థ ఉండాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. గత పాలనలో ఫోటోలు రంగుల పిచ్చి మీరంతా చూసారు. యూనిఫామ్ దగ్గర నుండి చిక్కీ వరకూ పార్టీ రంగులు, ఫోటోలు. ఫీజు రీయింబర్స్మెంట్ నుండి చిక్కీల వరకూ 6500 కోట్ల బకాయిలు నా నెత్తి మీద పోయారు. బకాయిలన్నీ క్రమ పద్దతిలో చెల్లిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. స్టూడెంట్ కిట్ కి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరు పెట్టాం. గత ప్రభుత్వ పాలనలో 1200 స్కూళ్లు వన్ క్లాస్ ... వన్ టీచర్ ఉంటే ఇప్పుడు 9800 స్కూల్స్ లో వన్ క్లాస్... వన్ టీచర్ పెంచాం. ఉద్యోగస్తులు ప్రభుత్వానికి గుండెకాయ. సీఎస్ గారి దగ్గర నుండి క్షేత్ర స్థాయిలో పనిచేసే చిన్న ఉద్యోగి వరకూ గత ఏడాది కాలం కష్టపడి పనిచేసారు. ప్రభుత్వ ఉద్యోగస్తులందరికీ హ్యాట్సాఫ్. ముఖ్యంగా నా టీచర్లు పూర్తి స్థాయిలో నాకు సహకారం అందించారు. గత ప్రభుత్వం ఉద్యోగస్తులను ఎలా అవమానించారో అందరూ చూసాం. ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు క్యూ లైన్ కంట్రోల్ చెయ్యమని నిలబెట్టారు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. అనేక హామీలు ఇచ్చి ఉద్యోగస్తులను గత ప్రభుత్వం మోసం చేసింది. ఇప్పుడు ఏదైనా సమస్య వస్తే కూర్చొని మాట్లాడుకుంటున్నాం.

ప్రజలకు చేరువగా ఉండండి!

దేవుడు కూడా అన్ని సమస్యలు తీర్చలేడు. అవకాశం ఉన్నంత వరకూ సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ప్రభుత్వం పెట్టి పోయిన బకాయిలు చెల్లిస్తున్నాం. ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగస్తుల సహకారం ఎంతో అవసరం. నేను 65 ప్రజా దర్బార్లు నిర్వహించాను. ప్రతి రోజు ప్రజల్ని కలుస్తున్నాను. ఆ ఫైల్స్ అన్ని మంత్రులకు ఇచ్చి రిక్వెస్ట్ చేస్తున్నాను. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజలకు మరింత దగ్గర అవ్వాలి. అనేక సమస్యలతో వారు మీ దగ్గరకు వస్తారు. వారిని ఆప్యాయంగా పలకరించి సమస్య పరిష్కారం కోసం కృషి చేయండి. ఉద్యోగస్తులు తలుచుకుంటే స్వర్ణాంధ్ర ఖచ్చితంగా సాధ్యం అవుతుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకటి గుర్తుపెట్టుకోవాలి. గత పాలకుల అహంకారం, అరాచకంతో 151 - 11 అయ్యింది. కాలర్ ఎగరేసి తిరగడం కాదు, ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని మంత్రి లోకేశ్ అన్నారు.

## లీడ్స్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య

# తొలి టెస్ట్ మ్యాచ్

### క్రీజులో కేఎల్ రాహుల్ (72), రిషభ్ పంత్ (31)





- నాలుగో రోజు ఆటలో లంచ్ బ్రేక్... 150 దాటిన భారత్ ఆధిక్యం
- నాలుగో రోజు లంచ్ సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 153 పరుగులు
- భారత్ కు ప్రస్తుతం 159 పరుగుల ఆధిక్యం
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471, ఇంగ్లాండ్ 465 పరుగులు

లీడ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు, సోమవారం లంచ్ విరామ సమయానికి భారత్ పటిష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోంది. ఆట ముగిసే సమయానికి టీమిండియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్‌పై ప్రస్తుతం 159 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్ 72 పరుగులు, రిషభ్ పంత్ 31 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. రెండో ఇన్నింగ్స్ లో భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో జామీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ (30) కొంతసేపు రాహుల్‌కు సహకరించినప్పటికీ, బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో జాక్ క్రాలీకి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో భారత్ 92 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ రిషభ్ పంత్, మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ అప్రమత్తంగా ఆడుతూ, మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. రాహుల్ 157 బంతుల్లో 9 ఫోర్లతో 72 పరుగులు చేయగా, పంత్ 59 బంతుల్లో 4 ఫోర్లతో 31 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 61 పరుగులు జోడించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బెన్ స్టోక్స్ ఒక వికెట్ తీసుకున్నాడు. ఈ మ్యాచ్ లో, భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులకు ఆలౌట్ కాగా, ఇంగ్లాండ్ జట్టు 465 పరుగులు చేసింది. దాంతో భారత్ కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ప్రస్తుతం భారత్ 159 పరుగుల ఆధిక్యంలో ఉండటంతో, మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. లంచ్ విరామం అనంతరం టీమిండియా ఎలా ఆడుతుందన్న దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.





## శతకొట్టిన కేఎల్ రాహుల్

ఇంగ్లండ్‌తో మొదటి టెస్టులో కేఎల్ రాహుల్ అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగుల వద్ద అవుటైన ఈ స్టార్ ఓపెనర్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం శతకంతో మెరిశాడు. జట్టు కష్టాల్లో ఉన్న వేళ పెద్దన్నలా ఆదుకుని బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటున్నాడు. 202 బంతుల్లో వంద పరుగుల మార్కును అందుకున్నాడు.



## ఇలా అయితే వేదన తప్పదు

# అదే నీవు... అదే దైవం!



దైవం ఈ క్షణంలోనే ఉంది. ఈ క్షణంలో నీవు ఎక్కడ ఉన్నా సరే, ఏమి చేస్తున్నాసరే ఆత్మస్థితిలోకి వెళ్ళగలవు. అదే దివ్యచైతన్యం. అదే నీవు, అదే దైవం. ఆ సమాధి స్థితి దైనందిన జీవితంలో నిరంతరం ఉండాలి. ఎల్లప్పుడూ ఆత్మదర్శనంలోనే ఉండాలి. చూసేవాడివే నీవు, శరీరానికి, మనస్సుకు ఏమి జరుగుతున్నా సరే సంపూర్ణంగా స్వీకరించు, వాటికి అంటకుండా దూరంనుంచి గమనిస్తూ ఉండు. విషయాలను తర్కించి, జరుగుతున్నది మంచేనా లేక చెడా అని రకరకాలుగా అలోచిస్తూ సంస్కారాలను పెంచుకోవద్దు. జరుగుతున్నది ఏదైనా సరే నీవు సాక్షిగా చూస్తున్నావా లేదా అన్నదే ముఖ్యం. అదే నిన్ను మనస్సుకు అతీతంగా తీసుకెళ్తుంది. శరీరము%-%మనస్సులకు జరుగుతున్న వాటితో కలిసిపోయావంటే వేదనలను అనుభవిస్తావు. జరుగుతున్న వాటిని సాక్షిగా గమనిస్తే ఆత్మలోని అనందమే నీవు అవుతావు. దుఃఖించేవాడివి నీవు కాదు, దుఃఖించేవాడిని గమనించేవాడివే నీవు. ఇలాంటి జీవనశైలిని అలవర్చుకుంటే నిత్యం సచ్చిదానందంలో ఉంటావు. అది నొప్పిఐనా, అవమానమైనా, సంతోషమైనా, విజయమైనా, ప్రశంసైనా.... ఏదైనాసరే నీకు అంటకూడదు. సమభావంతో స్వీకరించు, సాక్షిగా గమనించు. సత్యం నీలో ఉంది. దేన్ని వెంబడించినా ఆనందం రాదు గుర్తుంచుకో. అన్నింటిలోనూ జీవించు కానీ వేటితోనూ కలిసిపోవద్దు. ఆధ్యాత్మికంగా ఉండడమంటే కోరికల్ని అణిచివేయడమని, కొన్ని పనుల్ని చేయకూడదని, సంసారాన్ని త్యజించడమని, హిమాలయాలకు వెళ్ళడమని కొందరు చెప్పే అజ్ఞానపు పోకడలను అనుసరించవద్దు. అసలు జరుగుతున్నదేదీ సత్యం కానపుడు దాన్ని వదిలేయడం ఏమిటి? నీవే దైవమైనప్పుడు దేన్ని వదిలేయాలి? మనస్సుతో మాత్రం ఎప్పుడూ ఏకమవ్వద్దు. మనకున్న నమ్మకాలు, భయాలు, అ?ోహలు అన్నీ మనస్సు వల్లనే. సత్యాన్ని తెలుసుకోనీయకుండా చేసేది మనస్సే. నీవు సాక్షివైనప్పుడే మనస్సు అంతమవుతుంది. అలోచనలు లేని శుద్ధ చైతన్యం అనుభవమౌతుంది. బుద్ధుడు, మహావీరుడు మొదలైన యోగులు కూడా దేవుడు భౌతికమని ఎన్నడూ చెప్పలేదు. సత్యమే దైవం. అదే నీ నిజస్థితి. దేవుడు అనేది నీచివరి మజిలీ. దైవాన్ని నమ్మడం అనేది దైవాన్ని నీవు అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి ఏమాత్రం సహకరించదు. పైగా నమ్మకమే దైవాన్ని తెలుసుకోవడానికి అడ్డుపడుతుంది. నమ్మకాలనేవి నీ మనస్సులోని ఊహలే. సత్యాలు మాత్రం కావు. దైవాన్ని తెలుసుకోవడానికి ఏ క్రతువులు, భాషలు అవసరమే లేదు. కానీ ఈ రోజు ప్రతి మతంలోనూ మనస్సు తాలూకు నమ్మకాలు, అలవాట్లు అనేవే ఉన్నాయి కానీ నిన్ను నీవు తెలుసుకోవడం, సాక్షీభావనతో ఉండడం అనే అంశాలే ఉండటం లేదు. ఎన్ని శాస్త్రాలు చదివినా, గ్రంథాలు చదివినా అది మన అహంకారాన్ని పోషించి మనస్సును ఇంకా బలపరచి సత్యానికి అడ్డుగోడలు కడుతుందే కానీ సత్యాన్ని తెలుసుకోనివ్వదు. నిన్ను నీవు తెలుసుకోనివ్వకుండా అడ్డుపడేది మనస్సే. రోజాపువ్వు గురించి తెలుసుకున్నంత మాత్రాన నీవు ఆ రోజాపువ్వుని ఆస్వాదించలేవు. ఒక విషయం గురించిన జ్ఞానం ఆ విషయానుభవానికే అడ్డమవుతుంది. మనస్సు నిన్ను సత్యాన్ని తెలుసుకోనివ్వదు. ఆనందాన్ని అనుభవించ నీయదు. ఏదో ఒక కొత్త సమస్యను, కోరికను సృష్టిస్తూ, ప్రశ్నిస్తూ, ఈ క్షణాన్ని తిరస్కరిస్తూ ఉంటుంది. ఆనందం మనస్సుకు అతీతమైన స్థితి కనుక అక్కడికి నిన్ను వెళ్ళనివ్వకుండా అడ్డుపడుతూనే ఉంటుంది. దీని ఉచ్చునుండి బయటపడడానికి అనుక్షణం నీవు సాక్షీభావనతో నిన్ను నీవు గమనిస్తూ ఉండాలి. చేతనలో ఉండాలి. చేతన అనేది మనస్సుకాదు కానీ మనస్సు ద్వారా ప్రవహిస్తుంది. ఇది అనుభవపూర్వకంగా మాత్రమే తెలుసుకోగలవు. నిత్యజీవితంలో ఈ సాక్షీభావన అనేది సాధన చేయటం చాలా ముఖ్యం.

## నమ్మశక్యంకాని రీతిలో మ్యాచ్‌ను గెలిపించిన వరుణ్ చక్రవర్తి.



### . భావోద్వేగానికి లోనైన అశ్విన్

తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బ్యాటర్‌గా చెలరేగిపోయాడు. లక్ష్య ఛేదనలో చివరి 2 బంతుల్లో 7 పరుగులు అవసరమైనప్పుడు.. వరుసగా సిక్సర్, బౌండరీ కొట్టి తన జట్టును గెలిపించాడు. వరుణ్ మ్యాచ్‌ను గెలిపించాక, అతని జట్టు కెప్టెన్, టీమిండియా దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్రమైన భావోద్వేగానికి లోనయ్యాడు. కాసేపు తల వంచుకొని అలాగే ఉండిపోయాడు. అనంతరం వరుణ్‌ను అభినందించేందుకు గ్రౌండ్‌లోకి వచ్చాడు. ఈ మొత్తం తంతుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. తమిళనాడు ప్రీమియర్ లీగ్ 2025లో భాగంగా దిండిగుల్ డ్రాగన్స్, సేలమ్ స్పార్టన్స్ జట్లు నిన్న (జూన్ 22) తలపడ్డాయి. ఈ లీగ్‌లో రవిచంద్రన్ అశ్విన్ దిండిగుల్ డ్రాగన్స్‌కు సారథ్యం వహిస్తుండగా.. వరుణ్ చక్రవర్తి ఆ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్పార్టన్స్.. నిధీశ్ రాజగోపాల్ (47 బంతుల్లో 74) చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. స్పార్టన్స్ ఇన్నింగ్స్‌లో రాజేంద్రన్ (35), సన్నీ సంధు (25) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. స్పార్టన్స్‌ను అశ్విన్ అద్భుతమైన బౌలింగ్‌తో దెబ్బకొట్టాడు. అశ్విన్ తన కోటా 4 ఓవర్లలో 3 వికెట్లు తీసి కేవలం? 22 పరుగులు మాత్రమే ఇచ్చాడు. సందీప్ వారియర్, కార్తీక్ శరణ్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో డ్రాగన్స్‌ను అశ్విన్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ లీగ్‌లో ఆది నుంచి ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న అశ్విన్ నిన్నటి మ్యాచ్‌లో 14 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 36 పరుగులు చేశాడు. అశ్విన్ ఔటయ్యాక కాస్త తడబడిన డ్రాగన్స్‌ను శివమ్ సింగ్ (34), జయంత్ (25), హన్నీ సైనీ (35), విమల్ కుమార్ (24) ఓ మోస్తరు ఇన్నింగ్స్‌లతో ఆదుకున్నారు. వికెట్లు పడుతున్నా వీరు డ్రాగన్స్‌ను గెలుపు ట్రాక్‌లోనే ఉంచారు. తొమ్మిదో స్థానంలో వరుణ్ చక్రవర్తి బ్యాటింగ్‌కు దిగే సమయానికి డ్రాగన్స? గెలుపుకు 11 బంతుల్లో 20 పరుగులు అవసరంగా ఉన్నాయి. ఈ దశలో బ్యాట్‌కు పని చెప్పిన వరుణ్, నమ్మశ్యంకాని రీతిలో 5 బంతుల్లో 13 పరుగులు చేసి తన జట్టును గెలిపించాడు. చివరి 2 బంతుల్లో 7 పరుగులు అవసరమైన తరుణంలో వరుణ్ వరుసగా సిక్సర్, బౌండరీ కొట్టి గెలిపించిన వైనం మ్యాచ్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాట్‌తో ఇరగదీసిన అశ్విన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.



## 8.49 లక్షల మందికి కొత్తగా ఈపీఎఫ్



ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధిలోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ ఏడాది మార్చి నెలలో చేరికతో పోల్చితే 31 శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 1 శాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.49 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 17.63 శాతం పెరిగారు. కొత్త సభ్యుల్లో 57 శాతం మేర అంటే, 4.89 లక్షల మంది వయసు 18%-%25 ఏళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోల్చి చూస్తే 35 శాతం అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 19 శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21 శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు.

## జియో నుంచి 2 కొత్త ప్లాన్‌లు..

# ప్రత్యేక బెనిఫిట్లు..



మొబైల్ గేమర్లకు శుభవార్త.. గేమింగ్ ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన రెండు కొత్త అపరిమిత 5జీ డేటా ప్లాన్లను రిలయన్స్ జియో లాంచ్ చేసింది. ఈ కొత్త ప్లాన్లు హై-స్పీడ్ డేటాను మాత్రమే కాకుండా ఉచిత బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియా (బీజీఎంఐ) స్కిన్లు, జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ వంటి గేమింగ్ ప్రయోజనాలను కూడా అందిస్తాయి. వినియోగదారులు వాటిని డౌన్లోడ్ చేయకుండానే 500కి పైగా ప్రీమియం గేమ్‌లను ఆడుకోవచ్చు.

### ప్లాన్ వివరాలు.. ప్రయోజనాలు

జియో ప్రారంభించిన కొత్త ప్లాన్‌లు.. ఒకటి రూ.495 ప్లాన్, మరొకటి రూ.545 ప్లాన్. ఈ రెండు ప్లాన్లూ 28 రోజుల వ్యాలిడిటీతో వస్తాయి. రూ.495 ప్లాన్లో రోజుకు 1.5 జీబీ డేటా, అదనంగా 5 జీబీ బోనస్ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ లభిస్తుంది. రూ.545 ప్లాన్లో రోజుకు 2 జీబీ 4జీ డేటా, అన్లిమిటెడ్ 5జీ డేటాతో పాటు అదే గేమింగ్ బెనిఫిట్స్ లభిస్తాయి. రెండు ప్లాన్లలో బార్డ్స్ జర్నీ సెట్, డెసర్ట్ టాస్క్ ఫోర్స్ మాస్క్, ట్యాప్ బూమ్ మొలోటోవ్ కాక్టెయిల్ వంటి ప్లేయర్లకు ఉచిత ఇన్-గేమ్ వస్తువులను అందించే ప్రత్యేక బీజీఎంఐ రివార్డ్ కూపన్లు కూడా ఉన్నాయి. ఈ రివార్డులను క్లెయిమ్ చేసుకోవడానికి వినియోగదారులు గేమింగ్ ప్యాక్‌లలో దేనితోనైనా రీఛార్జ్ చేసుకోవచ్చు. రీఛార్జ్ చేసిన తర్వాత, ధృవీకరణ సందేశం వస్తుంది. మై జియో యాప్‌లో రివార్డ్ కూపన్లు లభిస్తాయి. ప్లేయర్ క్యారెక్టర్ ఐడీ, ఇచ్చిన యూనిక్ కోడ్ ఉపయోగించి ఈ కూపన్లను అధికారిక బీజీఎంఐ వెబ్సైట్లో రీడీమ్ చేసుకోవచ్చు. ఇక జియోగేమ్స్ క్లౌడ్ వినియోగదారులు హై-ఎండ్ పరికరాలు అవసరం లేకుండా నేరుగా వారి స్మార్ట్‌ఫోన్లు, టీవీలు లేదా బ్రౌజర్లలో గేమ్స్ ఆడవచ్చు. ఈ సేవను పొందడానికి వినియోగదారులు జియోగేమ్స్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, వారి జియో నంబర్‌తో లాగిన్ కావాలి. సబ్‌స్క్రిప్షన్ ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతుంది.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com
మంగళవారం - 24 - జూన్- 2025

# దృశ్యం 3 గూస్ బంప్స్ ప్లానింగ్..!



మళయాళం నుంచి వచ్చే థ్రిల్లర్ కథలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. అదేంటో అక్కడి దర్శకుల్లా సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు ఎవరు తీయలేరు అనే విధంగా వారి సినిమాలు ఉంటాయి. ముఖ్యంగా మిస్టరీ థ్రిల్లర్స్ మీద ఆ సస్పెన్స్ ని కొనసాగిస్తూ ఆడియన్స్ ని సీట్ ఎడ్జ్ మీద కూర్చోబెట్టగలిగే రైటింగ్ తో ఆకట్టుకుంటారు. ఇలాంటివి మలయాళం నుంచి చాలా సినిమాలు రాగా వాటిలో దృశ్యం సినిమా ఒకటి. జీతూ జోసెఫ్ డైరెక్షన్ లో మోహన్ లాల్ లీడ్ రోల్ లో తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. దృశ్యం మాత్రమే కాదు దృశ్యం 2 కూడా అదే





తరహాలో ప్రేక్షకులను అలరించింది. ఆ సినిమాలపై ఆడియన్స్ చూపించిన అభిమానం వల్ల దృశ్యం, దృశ్యం 2 సినిమాలు ఇతర భాషల్లో కూడా రీమేక్ అయ్యాయి. తెలుగులో వెంకటేష్, హిందీలో అజయ్ దేవగన్ ఇలా మాత్రుక కథను ఏమాత్రం ట్రాక్ తప్పకుండా సినిమా తీసి సక్సెస్ అందుకున్నారు. తెలుగులో దృశ్యం సినిమాను శ్రీప్రియ డైరెక్ట్ చేయగా దృశ్యం 2 సినిమాను మాత్రం జీతూ జోసెఫ్ డైరెక్ట్ చేశాడు. ఐతే దృశ్యం 3 సినిమా విషయంలో మెగా ప్లానింగ్ తో వస్తున్నట్టు తెలుస్తుంది. దృశ్యం 3 అంటూ ఈమధ్య అజయ్ దేవగన్ ఒక అనౌన్స్ మెంట్ చేయగా జీతూ జోసెఫ్, మోహన్ లాల్ కాంబోలో ఒక సినిమా అనౌన్స్ మెంట్ వచ్చింది. ఐతే ఈ రెండు సినిమాల కథలు వేరని అనుకున్నారు. కానీ దృశ్యం లవర్స్ ని సర్ ప్రైజ్ చేస్తూ జీతూ జోసెఫ్ దృశ్యం 3 కథను అన్ని భాషల్లోకి అందిస్తున్నారట. దృశ్యం 3 మలయాళంలో రావడం మళ్లీ దాన్ని ఇతర భాషల్లో రీమేక్ చేయడం కాకుండా దృశ్యం 3 ని మలయాళంలో, హిందీలో ఒకేసారి తెరకెక్కిస్తున్నారట. కేవలం మలయాళం, హిందీ మాత్రమే కాదు తెలుగు, తమిళ్ లో కూడా కథను సిద్ధం చేసి ఆ సినిమాలు సెట్స్ మీదకు వెళ్లడం లేట్ అయినా కూడా తప్పకుండా రిలీజ్ డేట్ మాత్రం ఒకటే అయ్యేలా ప్లాన్ చేస్తున్నారట. ఓ విధంగా అసలు సిసలు పాన్ ఇండియా బొమ్మగా దృశ్యం 3 ని ప్లాన్ చేస్తున్నాడు జీతూ జోసెఫ్. ఇదే ప్లాన్ వర్క్ అవుట్ అయితే మాత్రం అదిరిపోతుందని చెప్పొచ్చు. జీతూ జోసెఫ్ మీద ఎలాగు సూపర్ కాన్ఫిడెంట్ గా ఉంటుంది కాబట్టి మలయాళంతో పాటు ఇతర భాషల మేకర్స్ సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు.




# అమీర్ ఖాన్.. ఈసారి హిట్టు కొట్టినట్లేనా?

3 ఇడియట్స్ - పీకే - దంగల్ లాంటి సినిమాలతో బాక్సాఫీస్ వద్ద ఒక ట్రెండ్ సెట్ చేసిన అమీర్ ఖాన్ ఈమధ్య కాలంలో కొన్ని ఊహించని డిజాస్టర్స్ ను ఎదుర్కొన్నాడు. సౌత్ సినిమాల డామినేషన్ తో ఖాన్ త్రయం సందిగ్ధంలో పడగా ఎక్కువ ప్రభావం మిస్టర్ పర్ఫెక్ట్ మీదే పడింది. అయినప్పటికీ సేఫ్ గేమ్ ఆడకుండా ప్రయోగాత్మక కథలపైనే ఫోకస్ పెట్టాడు అమీర్ ఖాన్. ఇప్పుడు ఉన్న బాలీవుడ్ హీరోల్లో తన సినిమాలతో సామాజికమైన అంశాలపై చర్చను తెచ్చే స్టైలే అమీర్ ఖాన్‌ది. లాల్ సింగ్ చద్దా డిజాస్టర్ తర్వాత మళ్లీ రీమేక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది. 'సితారే జమీన్ పర్' అనే ఎమోషనల్ డ్రామాతో అందరినీ ఆలోచనలో పడేసాడు. హాలీవుడ్ చిత్రం 'చాంపియన్స్' ఆధారంగా రూపొందిన ఈ సినిమా, పిల్లలపై, వారి మానసిక స్థితిపై ఫోకస్ చేస్తూ తనదైన శైలిలో అమీర్ మళ్లీ స్క్రీన్ మీద మెరిశాడు. ఈ సినిమాపై మొదటి రెండు రోజులు పెద్దగా అంచనాలు లేకపోయినా, ఇప్పుడు క్రమంగా వేగం పెంచుతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన మూడు రోజుల్లోనే ఈ సినిమా దాదాపు 60 కోట్లు వసూలు చేసింది. ఆదివారం ప్రత్యేకంగా మంచి గ్రోత్ కనిపించింది. మహేష్ బాబు వంటి సౌత్ స్టార్లు ఈ సినిమాపై సోషల్ మీడియాలో సపోర్ట్ తెలపడంతో పాజిటివ్ వేవ్ మరింత పెరిగింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా అనే అభిప్రాయం జనం మధ్య



విస్తరిస్తోంది. ఈ సినిమాకు పెద్ద రేంజ్ బ్లాక్‌బస్టర్ స్థాయి టాక్ రాకపోయినా, ఓ ఫ్యామిలీ డ్రామాగా నిలవగలదని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. బాలీవుడ్‌లో ఇప్పట్లో పెద్ద రిలీజ్‌లు లేకపోవడంతో హిందీ ఆడియన్స్‌కు ఇది బెస్ట్ ఆప్షన్ గా మారుతోంది. కుబేర హిందీలో పెద్దగా క్లిక్ కాకపోవడంతో అమీర్ సినిమా స్థిరమైన చోటు దక్కించుకుంటోంది. తారే జమీన్ పర్, చక్ దే ఇండియా వంటి భావోద్వేగ చిత్రాల మిక్స్ లా ఉండడంతో ఫ్యామిలీస్ అట్రాక్ట్ అవుతున్నారు. ఇక ఓటీటీ విషయానికి వస్తే, ఇప్పటికే కొన్ని సంస్థలు 100 కోట్లకు పైగా ఆఫర్ చేసినా అమీర్ ఖాన్ మాత్రం యూట్యూబ్ పేపర్ వ్యూ మోడల్‌నే ముందుగానే ప్లాన్ చేశాడని తెలుస్తోంది. థియేటర్లో మంచి వసూళ్లు వస్తే అమీర్ ఆ డిస్ట్రిబ్యూషన్ మోడల్‌నే ఫాలో కావచ్చు. ఒకవేళ ఇంకా కలెక్షన్లు బాగా పెరిగితే, ఓటీటీ డీల్స్‌పై మళ్లీ ఆలోచించవచ్చని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇక తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక షోలు వేసే ఆలోచనలో అమీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే మళ్లీ ఒక కొత్త మార్కెట్‌ను టార్గెట్ చేసినట్టే అవుతుంది.

# అందాల ఇస్మార్ట్ బటర్‌ఫ్లై



ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ముద్దుగుమ్మ నభా నటేష్ ఈ మధ్య కాలంలో కాస్త స్లో అయింది. గత ఏడాది 'డార్లింగ్' అనే వెబ్ మూవీతో వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. ప్రస్తుతానికి ఈమె పెద్దగా సినిమాలు ఏమీ చేయడం లేదు. ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. ఆ సినిమాలు ఎప్పటికి కన్ఫర్మ్ అయ్యేది క్లారిటీ లేదు. వచ్చే ఏడాదిలో ఈ అమ్మడు తన సినిమాలతో వస్తానంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ధీమాగా చెప్పుకొచ్చింది. నభా నటేష్ సినిమా ఆఫర్ల సంగతి పక్కన పెడితే రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇంత అందమైన నభా నటేష్‌కి ఆఫర్లు రావడం లేదు పాపం అంటూ నెటిజన్స్ ఎప్పుడూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి తన ఫాలోవర్స్‌తో పాటు అంతా కూడా అబ్బ నభా అంటూ చూపు తిప్పుకోనివ్వకుండా చూసే విధంగా అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేసింది. బ్లూ నెట్టెడ్ డ్రెస్‌లో కనిపించిన ఈ అమ్మడు కవ్విస్తోంది. క్లీ వేజ్ షో తో మతి పోగొడుతున్న ఈ అమ్మడు మళ్లీ మళ్లీ తిరిగి చూసే విధంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సాదారణంగానే నభా నటేష్ అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా అందంగా నభా కనిపిస్తుంది అంటూ అభిమానులతో పాటు అంతా కామెంట్స్ చేస్తున్నారు. సింపుల్ మేకోవర్‌తో, సింపుల్ ఔట్ ఫిట్‌లో నభా నటేష్ ఆకట్టుకుంది. సింప్లీ సూపర్ అనే విధంగా ఉన్న నభా నటేష్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



కరోనా ముందు వరకు ఈ అమ్మడు వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత ఇండస్ట్రీలో ఈ అమ్మడు బిజీ అవుతుందని అంతా భావించారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి కరోనా కారణంగా ఆఫర్లు దక్కలేదు. ఏడాది పాటు పెద్దగా సినిమాలు చేయక పోవడం వల్ల ఆఫర్లు తగ్గాయి. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా మళ్లీ సినిమా ఇండస్ట్రీలో బిజీ కావాలని ప్రయత్నాలు చేస్తుంది. అది ఎంతవరకు సాధ్యం అనేది చూడాలి. కర్ణాటకలోని ఉడిపిలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఈ అమ్మడు జాతీయ అవార్డ్ గ్రహీత ప్రకాష్ బెలవాడి ఆధ్వర్యంలో నాటకాల్లో నటించింది. అంతే కాకుండా మోడలింగ్ తోనూ ఇండస్ట్రీలో గుర్తింపు దక్కించుకుంది. కాలేజ్ రోజుల్లోనే భరతనాట్యం శిక్షణ పొందడం వల్ల ఈ అమ్మడికి డాన్స్‌లో మంచి ప్రావిణ్యం దక్కింది. ఇండస్ట్రీలో ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే నభా నటేష్ అద్భుతమైన డాన్సర్‌గా గుర్తింపు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు కొత్త సినిమాల కోసం వెయిట్ చేస్తుంది. ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఒక సినిమా అయినా కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# పెళ్లైన తర్వాత ఖాళీ అయిన భామలు !



పెళ్లికాని భామలకంటే పెళ్లైన భామలే ఈ మధ్య కాలంలో ఎక్కువగా బిజీగా ఉంటున్నారని తేలింది. డబుల్ పారితోషికం చెల్లించి మరీ ఆయాభామల్ని ఎంపిక చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అలియాభట్, దీపికా పదుకొణే, కరీనా కపూర్ లాంటి భామల పేర్లు ప్రముఖంగా తెరపైకి వచ్చాయి. అయితే కియారా అద్వాణీ, కీర్తి సురేస్, అదితి రావు హైదరీ లాంటి పెళ్లైన భామలకు మాత్రం సెకెండ్ ఇన్నింగ్స్ లో అంతగా బిజీగా కనిపించలేదు అన్న అంశం చర్చకొస్తుంది. ప్రస్తుతం ఈ భామలు చేస్తోన్న సినిమాలన్నీ పెళ్లికి ముందు కమిట్ అయిన చిత్రాలు తప్ప పెళ్లికి ముందు ఒప్పందం చేసుకున్న చిత్రాలు కాదని వినిపిస్తుంది. కియారా అద్వాణీ 'వార్-2', 'టాక్సిక్' లో నటిస్తోంది. ఈ రెండు కూడా పెళ్లి కుదిరిన తర్వాత సెట్ అయిన ప్రాజెక్ట్ లు తప్ప అమ్మడి చేతిలో కొత్త సినిమాలేవి కనిపించలేదు. ఈ రెండు ఆన్ సెట్స్ లో ఉన్నాయి. ఇవి రిలీజ్ అయి హిట్ అయితే గానీ కియారా మళ్లీ బిజీ అయ్యేలా కనిపించలేదు. అలాగే కీర్తి సురేష్ గత ఏడాది డిసెంబర్ లోనే వివాహం చేసుకుంది. ప్రస్తుతం నటిస్తోన్న 'రివాల్వర్ రీటా', 'కన్నెవెడి' చిత్రాలు వివాహానికి ముందే కమిట్ అయిన చిత్రాలు. 'ఉప్పుకప్పు రంబు' అనే మరో సినిమా చేసింది. కానీ అది ఓటీటీలో రిలీజ్ అవుతుంది. ఇది కూడా పెళ్లికి ముందే కమిట్ అయిన చిత్రం. ఇక అదితి రావు హైదరీ సంగతి అయితే చెప్పాల్సిన పనిలేదు. సిద్దార్ధ్ ని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. వివాహానికి ముందు బాలీవుడ్ సహా ఇతర భాషా చిత్రాలతో కాస్త బిజీగా కనిపించేది. కానీ పెళ్లైన తర్వాత పూర్తిగా ఖాళీ అయిపోయింది. 'పరివారక్ మనురంజన్', 'లయెన్స్' చిత్రాల్లో నటిస్తోంది. ఈ రెండు కూడా పెళ్లికి ముందు కమిట్ అయిన ప్రాజెక్ట్ లే. వివాహం తర్వాత కొత్తగా సైన్ చేసిన చిత్రాలంటూ ఏవీ లేవు. ఇలా ముగ్గురు భామల విషయంలో అవకాశాల పరంగా మ్యారేజ్ కలిసి రాలేదనే చర్చ జరుగుతోంది.

# రకుల్ సమ్మోహన రూపానికి ఫిదా



సౌత్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత బాలీవుడ్ సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. ముంబై చిత్రసీమలోను రకుల్ ఫ్యాషనిస్టా వైబ్స్ కి ఫిదా అవ్వని వారు లేరు. అక్కడ నటుడు, ప్రముఖ నిర్మాత జాకీ భగ్నానీ ఈ బ్యూటీతో నిండా ప్రేమలో మునిగిన సంగతి తెలిసిందే. రకుల్- భగ్నానీ జంట వివాహం అనంతర జీవనశైలి గురించి ఎక్కువగా చర్చ సాగుతోంది. ఈ జంట చాలా కోణాల్లో ఆదర్శ జంట. ప్రధాని నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా ఉద్యమంలో గౌరవనీయ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. యోగా డే ఉత్సవాల నుంచి భర్త జాకీ భగ్నానీతో రకుల్ యోగా ఫీట్స్ కి సంబంధించిన ఫోటోలు వీడియోలు వైరల్ అయ్యాయి. రకుల్ నిరంతర ఫోటోషూట్లు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా హిందూస్తాన్ టైమ్స్ కోసం స్పెషల్ ఫోటోషూట్ లో పాల్గొంది రకుల్. ఇది ఫ్యాషనిస్టా రకుల్ లో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. రకుల్ ఫోటోషూట్లలో వన్ ఆఫ్ ది బెస్ట్ అని పొగిడేస్తే తప్పు లేదు. రకుల్ ముగ్ధ మనోహర రూపాన్ని ఫోటోగ్రాఫర్ క్యాప్చుర్ చేసిన తీరు ఎంతగానో ఆకట్టుకుంటోంది. రకుల్ పూసలతో రూపొందించిన డిజైనర్ టాప్ ధరించి అందంగా కనిపించింది. ఆ మెడలో అలంకరించిన డిజైనర్ ఆభరణం, చెవులకు డిజైనర్ లోలాకుల కాంబినేషన్ ఎంతగానో ఆకర్షిస్తోంది. అలాగే డిజైనర్ బ్రీడ్స్ బ్లౌజ్ కి తగ్గట్టే పొడవాటి లెహంగాను రకుల్ ధరించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే రకుల్ చివరిగా భారతీయుడు 2 (ఇండియన్ 2)లో కనిపించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయిన సంగతి తెలిసిందే. తదుపరి భారతీయుడు 3లో నటించాల్సి ఉంది.. కానీ దీనికి సంబంధించిన అప్ డేట్ లేదు. అలాగే అజయ్ దేవగన్ సరసన దేదే ప్యార్ దే 2లోను రకుల్ నటిస్తోంది.



# నవ్విస్తుంది, ఏడిపిస్తుంది.. లేటెస్ట్ సినిమాపై మహేశ్ ప్రశంసలు

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం సితారే జమీన్ పర్. 'సబ్ కా అప్న అప్న నార్మల్' అనేది ఉపశీర్షిక. ఆమిర్‌ఖాన్ నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన హిట్ ఫిల్మ్ 'తారే జమీన్ పర్' (2007)కు సీక్వెల్‌గా ఈ మూవీ తెరకెక్కింది. జూన్ 20న విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తోంది.తాజాగా ఈ సినిమాకు సూపర్ స్టార్ మహేశ్‌బాబు రివ్యూ ఇచ్చాడు. సితారే జమీన్ పర్.. అందరి మనసులు దోచుకుంటోంది. ఈ మూవీ మిమ్మల్ని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది. అలాగే చప్పట్లు కొట్టేలా చేస్తుంది. ఈ సినిమా చూశాక కచ్చితంగా చిరునవ్వుతో బయటకు వస్తారు అని రాసుకొచ్చాడు.






సితారే జమీన్ పర్ మూవీలో ఆమిర్ ఖాన్, జెనీలియా జంటగా నటించారు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించగా ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్‌ఖాన్, అపర్ణ పురోహిత్ నిర్మించారు. ఈ చిత్రంలో ఆరోష్ దత్తా, గోపీకృష్ణ వర్మ, సంవిత్ దేశాయ్, వేదాంత్ శర్మ, ఆయుష్ భన్సాలీ, ఆశిష్ పెండ్సే, రిషి షహానీ, రిషబ్‌జైన్ , నమన్ మిశ్రా, సిమ్రాన్ మంగేష్కర్ వంటి వారు కీలకపాత్రల్లో నటించారు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.